# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 7-3-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :26 సంచిక: 190 పేజీలు: 4 వెల: రూ.1/-


## కరోనాపై కేంద్రమంత్రి హర్షవర్ధన్ సమీక్ష

### తెలంగాణ ముందస్తు చర్యలకు ప్రశంసలు

న్యూఢిల్లీ,మార్చి6(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్‌పై కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి హర్షవర్ధన్ ఆయా రాష్ట్రాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో రాష్ట్రం తరపున వైద్యారోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శాంతకుమారి, యోగితా రాణా పాల్గొన్నారు. కరోనా వైరస్ నియంత్రణపై కేంద్ర మంత్రి పలు సూచనలు చేశారు. కరోనాను అరికట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఈటల రాజేందర్‌కు కేంద్రమంత్రికి వివరించారు. తెలంగాణ ప్రభుత్వ చర్యలను హర్షవర్ధన్ అభినందించారు. పకడ్బందీ ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారని కేంద్ర మంత్రి కొనియాడారు. మిగతా రాష్ట్రాలు కూడా తెలంగాణను అనుసరించాలని కేంద్ర మంత్రి సూచించారు. ఎన్-95 మాస్క్‌లను అందించాలని హర్షవర్ధన్‌ను ఈ సందర్భంగా ఈటల కోరారు. మరో కరోనా ల్యాబ్ ఏర్పాటు చేయాలని మంత్రి ఈటల రాజేందర్ కేంద్రాన్ని కోరారు.

# సీఎం కేసీఆర్ కృషితో ప్రగతి పథంలో తెలంగాణ

హైదరాబాద్,మార్చి6(ఆర్ఎన్ఎ): సంక్షేమం,అభివృద్ధి సమపాళ్లలో సాగడంతో తెలంగాణ అన్ని రంగాల్లో ముందుకు దూసుకుని పోతున్నదని గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ స్పష్టం చేశారు. వివిధ రంగాల్లో సాధించిన పురోగతే ఇందుకు నిదర్శనమని అన్నారు. తెలంగాణలో అమలు చేస్తున్న పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని అన్నారు. పేదలకు కనీస జీవన భద్రత కల్పించాలని సంకల్పించి సంక్షేమ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తుందని గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ స్పష్టం చేశారు. బ్జడెట్ సమావేశాల సందర్భంగా ఉభయసభలను ఉద్దేశించి సభలో గవర్నర్ ప్రసంగించారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న



అసెంబ్లీ సమావేశాలను పురస్కరించుకుని గన్‌పార్క్ వద్ద అమరుల స్థూపానికి నివాళి అర్పించిన మంత్రులు సత్యవతి రాథోడ్, పువ్వాడ అజయ్, శ్రీనివాస్ గౌడ్, బోడకుంటి వెంకటేశ్వర్లు తదితరులు

### ఆరేళ్లుగా ప్రణాళికబద్ధంగా చిత్తశుద్ధితో కృషి
### విద్య, వైద్యం, విద్యుత్, సాగునీటిరంగాల్లో గణనీయ మైన ప్రగతి
### సంక్షేమ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత
### విద్యుత్ కోతలు లేని రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భావం
### వ్యవసాయరంగానికి ఇతోధిక ప్రోత్సాహం
### ధాన్యం ఉత్పత్తుల పెరుగుదలే దీనికి కొలమానం
### కోటి ఎకరాలకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం
### కేసీఆర్ కిట్‌తో ప్రభుత్వ ఆస్పత్రుల్లో పెరిగిన ప్రసవాలు
### రాష్ట్రంలో శాంతి భద్రతలు మెరుగయ్యాయి
### సత్ఫలితాలు ఇస్తున్న సిఎం కెసిఆర్ ప్రయత్నాలు
### ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ తమిళ సై ప్రసంగం

సంక్షేమ కార్యక్రమాలు పేదలకు భద్రత కల్పించాయి. దారిద్య రేఖకు దిగువన ఉండే కుటుంబాలను నిర్ధారించేందుకు గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయ పరిమితిని రూ. 60 వేల నుంచి రూ. లక్షన్నరకు పెంచిందని గవర్నర్ తెలిపారు. పట్టణాల్లో రూ. 75 వేల నుంచి రూ. 2 లక్షలకు పెంచింది. దీంతో ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో తక్కువ వేతనంతో పని చేస్తున్న ఉద్యోగులు కూడా సంక్షేమ పథకాలు పొందేందుకు అర్హులయ్యారని తమిళిసై తెలిపారు. విద్య, వైద్యం, సాగునీటి, విద్యుత్ రంగాల్లో గణనీయ మైన ప్రగతిని సాధించామ న్నారు. ఆరు దశాబ్దాల పోరాటం తర్వాత తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధ్య మైందని గవర్నర్ పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో ఆరేళ్ల ప్రణాళికబద్ధంగా చిత్తశుద్ధితో చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. స్వల్ప వ్యవధిలోనే తెలంగాణ అనేక రంగాల్లో అగ్రగామిగా నిలిచిందన్నారు. తక్కువ వ్యవధిలోనే రాష్ట్రం సాధించిన ప్రగతిని చూసి యావత్ దేశం అబ్బురపడుతోందన్నారు. సీఎం కేసీఆర్ కృషితో తెలంగాణ ప్రగతి పథంలో నడుస్తుందని గవర్నర్ పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పాటైన కొత్తలో విద్యుత్ కోతలు, రైతుల ఆత్మహత్యలు ఉండేవి. ఇప్పుడు విద్యుత్ కోతలను అధిగమించి, రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు సకాలంలో అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రైతులకు రైతుబంధు, రైతు బీమాతో భరోసా కల్పించామని తమిళిసై తెలిపారు. కేసీఆర్ పక్కా ప్రణాళికలతో సమస్యలను అధిగమించి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని గవర్నర్ పేర్కొన్నారు. కుటుంబ సభ్యులపై ఆధారపడకుండా వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ఆసరా పెన్షన్‌లు ఇస్తున్నామని చెప్పారు. బీడీ కార్మికులకు కూడా పెన్షన్లు ఇస్తున్నామని తెలిపారు. ఒంటరి మహిళలకు పింఛను ఇస్తున్న రాష్ట్రం కేవలం తెలంగాణ మాత్రమే అని ఆమె స్పష్టం చేశారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింద రూ. 1,00,116 ఇస్తున్నాం. కేసీఆర్ కిట్‌తో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెరిగాయి. సాగునీటి రంగంలో పురోగతి సాధించామని గవర్నర్ తెలిపారు. గతంలో రేషన్‌షాపు ద్వారా ఒక్కొక్కరికీ 4 కిలోల బియ్యం అందితే.. ఇప్పుడేమో ఒక్కొక్కరికీ 6 కిలోల బియ్యం చొప్పున అందిస్తున్నామని చెప్పారు. మత్స్యకారుల సంక్షేమం కోసం రాష్ట్ర వ్యాప్తంగా చెరువుల్లో చేపపిల్లలను ప్రభుత్వం వదిలిందని గవర్నర్ పేర్కొన్నారు.

#### బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఏర్పాటు

పేద బ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం బ్రహ్మణ సంక్షేమ పరిషత్



నెలకొల్పిందని గుర్తు చేశారు. పూజారులకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే క్రమం తప్పకుండా వేతనాలు చెల్లిస్తోందని గవర్నర్ స్పష్టం చేశారు. మసీదుల్లో ఉండే ఇమామ్, మౌజమ్‌లకు నెలకు రూ. 5 వేల చొప్పున భృతి అందిస్తోందన్నారు. ఎస్సీ, ఎస్టీలు తమ ఇళ్లకు ఉపయోగించే విద్యుత్‌ను 101 యూనిట్ల వరకు ఉచితంగా అందిస్తోందని తమిళిసై తెలిపారు. రైతుబీమాతో రాష్ట్రంలోని రైతు కుటుంబాలు ధీమాగా ఉన్నాయి. పోలీసు, ఉద్యోగ నియామకాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కేటాయించిందని ఆమె పేర్కొన్నారు. హోంగార్డులకు దేశంలో ఎక్కడా లేనంత వేతనం తెలంగాణలోనే అందుతుందన్నారు. ట్రాఫిక్ పోలీసులకు 30 శాతం అదనపు రిస్క్ అలవెన్స్ అందిస్తోందన్నారు. సింగరేణి కార్మికులకు లాభాల్లో 28 శాతాన్ని ప్రభుత్వం బోనస్‌గా అందిస్తోందని గవర్నర్ తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పేద విద్యార్థుల కోసం 959 రెసిడెన్షియల్ పాఠశాలలను నడుపుతోందన్నారు. విద్యార్థులకు పాఠశాలలు, వసతిగృహాల్లో ప్రభుత్వం సన్నబియ్యం భోజనాన్ని అందిస్తోందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతికి ప్రత్యేక ప్రగతినిధిని ఏర్పాటు చేసిందన్నారు. వివిధ వర్గాల జనాభా నిష్పత్తి ప్రకారం బ్జడెట్‌లో నిధులు కేటాయించి ఖర్చు చేస్తుందన్నారు. డ్రైవర్లు, హోంగార్డులు, వర్కింగ్ జర్నలిస్టులకు రూ. 5 లక్షల ప్రమాదబీమాను ప్రభుత్వం కల్పించిందని గవర్నర్ తెలిపారు.

#### రాష్ట్రంలో భేషుగ్గా శాంతిభద్రతలు

రాష్ట్రంలో శాంతి భద్రతలు మెరుగయ్యాయని, దేశంలో ఉన్న సీసీ కెమెరాల్లో 66శాతం తెలంగాణలో ఉన్నాయని గవర్నర్ తమిళిసై పేర్కొన్నారు. తెలంగాణ శాసనసభ బ్జడెట్ సమావేశాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ మాట్లాడుతూ ఆర్థికమాంద్యం ప్రభావం తెలంగాణపై కూడా పడిందన్నారు. అన్ని రాష్ట్రాల్లో వృద్ధి రేటు తిరోగమనంలో ఉందని, అయితే తెలంగాణ రాష్ట్రంలో ఆ దుస్థితి లేదని గవర్నర్ అన్నారు. ఆకలి దప్పులు లేని... అనారోగ్యాలు లేని.. శతృత్వంలేని రాజ్యమే గొప్ప రాజ్యమని తమిళిసై వ్యాఖ్యానించారు.

#### కాళేశ్వరంతో మారిన దశ

కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి వేగంగా పూర్తి చేస్తున్నామని గవర్నర్ తమిళిసై చెప్పారు. కాళేశ్వరం ప్రపంచంలోనే ఎత్తయిన ఎత్తిపోతల పథకమని, సీతారామ ప్రాజెక్టును త్వరలోనే పూర్తిచేస్తామన్నారు. కోటి ఎకరాలకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆమె చెప్పారు. రైతుబంధు కింద రూ.10 వేలు ఇస్తున్నామని, రైతుబీమాతో రైతు కుటుంబాలను ఆదుకుంటున్నామన్నారు. మిషన్ భగీరథతో మంచినీటి సమస్యను పరిష్కరించినట్లు చెప్పారు. తెలంగాణలో కోటి ఎకరాలకు సాగునీరు అందించడం లక్ష్యంగా ప్రభుత్వం సమగ్ర జలవిధానాన్ని రూపొందించుకుని అమలు చేస్తుందని అని గవర్నర్ పేర్కొన్నారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయడం ద్వారా 20 లక్షల ఎకరాల ఆయకట్టుకు ప్రభుత్వం నీరందిస్తున్నది అని తెలిపారు. మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువులను పునరుద్ధరించింది. దీనివల్ల తెలంగాణలో భూగర్భ జలమట్టం భారీగా పెరిగింది అని గవర్నర్ పేర్కొన్నారు. ప్రపంచంలోకెల్లా అతి భారీ బహుళ దశల ఎత్తిపోతల పథకంగా రికార్డు సృష్టించిన కాళేశ్వరం ప్రాజెక్టు దశల వారీగా పూర్తవుతున్నది. శరవేగంగా నడుస్తున్న పనులు తెలంగాణ ప్రజల కళ్ల ముందే ఉన్నాయి. త్వరలోనే కాళేశ్వరం ప్రాజెక్టు సంపూర్ణంగా పూర్తవుతుంది. ఈ ఏడాది వర్షాకాలం నుంచి గోదావరి నది నుంచి కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రోజుకు 3 టిఎంసిల నీటిని ఎత్తిపోసేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దేవాదుల ప్రాజెక్టుకు 365 రోజుల పాటు నీరందించడానికి సమ్మక్క బ్యారుజి పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ వేసవిలోనే ఈ బ్యారేజి నిర్మాణాన్ని పూర్తి చేయడానికి ప్రభుత్వం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నది. ప్రస్తుత దుమ్ముగూడెం ఆనకట్ట ప్రాంతంలోనే సీతామరామ ప్రాజెక్టుకు నీరందించడానికి, 320 మెగావాట్ల జలవిద్యుత్ ఉత్పత్తికి అనుగుణంగా ఉండేవిధంగా ప్రభుత్వం సుమారు 40 టిఎంసిల సామర్థ్యంతో సీతమ్మ సాగర్ బ్యారేజిని మంజూరు చేసింది. త్వరలోనే ఈ బ్యారేజి పనులు ప్రారంభం అవుతాయని సంతోషంగా ప్రకటిస్తున్నాను. తెలంగాణాలో నీటిపారుదల రంగం అద్భుతమైన పురోగతి సాధించిందని చెప్పడానికి, ఇప్పటికిప్పుడు మన కళ్లముందు సాక్షాత్కారిస్తున్న నిలువెత్తు నిదర్శనం ఈ యాసంగిలో వరి సాగులో తెలంగాణ సాధించిన పురోగతి. తెలంగాణలో యాసంగి పంట సమయంలో వరి పంట సాధారణ విస్తీర్ణం 17,08,397 ఎకరాలు. నీటి పారుదల రంగంలో రాష్ట్రం సాధించిన ప్రగతి వల్ల ఈ యాసంగి సీజన్ లో వరి పంట సాగు 38,19,419 ఎకరాలుగా వ్యవసాయశాఖ నమోదు చేసింది. యాసంగి సమయంలో 123.5 శాతం పెరిగిన వరి విస్తీర్ణం రాష్ట్రం సాధించిన విజయానికి సంకేతంగా నిలుస్తున్నది అని గవర్నర్ పేర్కొన్నారు.

#### పరిపాలనలో సంస్కరణలు

పరిపాలనలో భాగంగా భారీగా సంస్కరణలు తీసుకొచ్చామని గవర్నర్ తమిళిసై చెప్పారు. కొత్త పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాలను తీసుకొచ్చామన్నారు. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాలు ఫలితాలను ఇస్తున్నాయని, కొత్త రెవెన్యూ చట్టాన్ని ప్రభుత్వం రూపొందిస్తోందని చెప్పారు. టీఎస్ ఐపాస్ విధానంతో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షిస్తున్నామన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను వేగంగా నిర్మిస్తున్నామని గవర్నర్ తమిళిసై పేర్కొన్నారు.

అమరవీరుల కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థికసాయం చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని అన్ని డివిజన్లలో బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేశామని, కంటి వెలుగు తరహాలో చెవి, ముక్కు, గొంతు, దంత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

#### విద్యుత్ రంగంలో అద్భుత విజయాలు

విద్యుత్ రంగంలో రాష్ట్ర ప్రభుత్వం అద్భుతమైన విజయం సాధించిందని గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ స్పష్టం చేశారు. విద్యుత్ రంగంలో సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత వ్యూహాత్మకంగా, చాకచక్యంగా వ్యవహరించిందని గవర్నర్ తెలిపారు. దీంతో తెలంగాణ రాష్ట్రం విద్యుత్ రంగంలో అనితర సాధ్యమైన విజయాలు సాధించిందని చెప్పారు. ఇవాళ తెలంగాణ రాష్ట్రం దేశంలోనే తలసరి విద్యుత్ వినియోగం అధికంగా కలిగిన రాష్ట్రంగా నిలబడి ఉందన్నారు. 23 జిల్లాల సమైక్య రాష్ట్రంలో 13,162 మెగావాట్ల గరిష్ట డిమాండ్ ఏర్పడితే, తెలంగాణ రాష్ట్రంలో అంతకుమించి, 13,168 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ వచ్చిందన్నారు. ఇంత పెద్ద ఎత్తున డిమాండ్ ఏర్పడినప్పటికీ ఎక్కడా ఏ మాత్రం కోతలు, లోటు లేకుండా రాష్ట్రంలో విద్యుత్ సరఫరా చేసుకోగలిగామని గవర్నర్ పేర్కొన్నారు. ఇది తెలంగాణ రాష్ట్రం సాధించిన ఘన విజయమని ఆమె అన్నారు. నేడు రాష్ట్రంలో అన్ని రంగాలకు 24 గంటలు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసుకోగలుగుతున్నామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సమయంలో 7778 మెగావాట్ల స్థాపిత విద్యుత్ సామర్థ్యం కలిగి ఉంటే, నేడు తెలంగాణ రాష్ట్రానికి 16,246 మెగావాట్ల స్థాపిత విద్యుత్ అందుబాటులోకి వచ్చిందని గవర్నర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని మిగులు విద్యుత్ రాష్ట్రంగా మార్చేందుకు కొత్త విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల నిర్మాణం శరవేగంగా సాగుతుందని గవర్నర్ తమిళిసై స్పష్టం చేశారు.

#### రైతుబంధు సమితిగా మార్పు

రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమ కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు సమన్వయ సమితి పేరును మార్చాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ ప్రకటించారు. రైతు సమన్వయ సమితి ఇక నుంచి రైతు బంధు సమితిగా మారనుంది అని గవర్నర్ తెలిపారు. రైతులను సంఘటితం చేయడమే రైతు బంధు సమితి ఉద్దేశమని చెప్పారు. విత్తనాలు నాటినప్పటి నుంచి పంట చేతికొచ్చిన తర్వాత అమ్ముకునే సమయంలో గిట్టుబాటు ధర కల్పించే వరకు రైతు బంధు సమితి కీలక పాత్ర పోషిస్తుందని గవర్నర్ పేర్కొన్నారు. దీనికి సంబంధించిన కార్యాచరణను ప్రభుత్వం రూపొందిస్తున్నట్లు గవర్నర్ తమిళిసై తెలిపారు.

## అందరికీ నమస్కారం..వణక్కం

### తెలుగులో వందనంతో ప్రసంగించిన గవర్నర్ తమిళసై

హైదరాబాద్,మార్చి6(ఆర్ఎన్ఎ): తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ తమిళి సై ప్రసంగించారు. అందరికీ నమస్కారం.. వణక్కం.. అంటూ తెలుగు, తమిళ భాషల్లో ఆమె తన ప్రసంగం ప్రారంభిం చారు. అనంతరం ఇంగ్లీషులో బ్జడెట్ ప్రసంగాన్ని కొనసాగించారు. 60 ఏళ్ల పోరాటం తర్వాత తెలంగాణ ఏర్పడిందని.. ఉద్యమ నేత తెలంగాణ సీఎంగా ఉన్నారని ఆమె అన్నారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ అని రంగాల్లో దూసుకు పోతోందని తెలిపారు. అన్ని రంగాల్లో తెలంగాణ గణనీయ అభివృద్ధి సాధిస్తోం దన్నారు. చుక్క నీరులేని తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం పంట పండించిందని చెప్పారు. తక్కువ సమయంలో తెలంగాణ అభివృద్ధి చెందుతోందని.. కరెంట్, నీటి సమస్యను తెలంగాణ అధిగమించిందని పేర్కొన్నారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామని.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చెరువులను నిర్లక్ష్యం చేశారన్నారు. విద్య, వైద్యం, తాగు, సాగునీటి రంగాలు నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు వివక్షకు గురయ్యాయని తెలిపారు. తెలంగాణలో ట్రాక్టర్లు, ఆటోలపై రవాణా పన్ను ఎత్తివేత, దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో 969 రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటులో రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తోం దన్నారు. బీడీ కార్మికులు రూ.2016 పెన్షన్ ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని తెలిపారు.

# 20 వరకు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

### నేడు గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానం
### 8న బడ్జెట్...20న ద్రవ్య వినిమయ బిల్లు

హైదరాబాద్,మార్చి6(ఆర్ఎన్ఎ): అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 20 వరకు జరుగనున్నాయి. మొత్తం 12రోజుల పాటు సమావేశాలు సాగనున్నాయి. ఇందులో 9,10, 15వ తేదీలను సెలవులుగా పరిగణిస్తున్నారు. ఈ మేరకు బిఎసిలో నిర్ణయం తీసుకున్నారు. అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన శాసనసభ వ్యవహారాల సలహా సంఘం(బీఏసీ) సమావేశమైంది.

ఈ సమావేశంలో రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టే తేదీతో పాటు శాసనసభ, మండలి సమావేశాల ఎజెండాను ఖరారు చేశారు.

ఈ నెల 8వ తేదీ ఆదివారం నాడు బ్జడెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. మొత్తం 12 రోజుల పాటు జరిగే ఈ సమావేశాలు 20వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఈ నెల 9, 10, 15 తేదీల్లో సభకు సెలవులు ప్రకటించారు. బీఏసీ సమావేశానికి సీఎం కేసీఆర్, మంత్రులు, అక్బరుద్దీన్ ఓవైసీ, భట్టి విక్రమార్క హాజరయ్యారు.

ఆదివారం ఆర్థికమంత్రి హరీష్ రావు బడ్జెట్ ప్రవేశ పెడతారు. శనివారం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ చేపడతారు. అనంతరం సిఎం కెసిఆర్ దానికి సమాధానం చెబుతారు. ఆదివారం బడ్జెట్ ప్రవేశ పెట్టాక సోమవారం సెలవు ప్రకటించారు. ఆ మరునాడు హోళీ సందర్భంగా అసెంబ్లీకి సెలవు ఉంటుంది. ఇక 20న ద్రవ్యవినిమయ బిల్లు ఆమోదంతో సమావేశాలు ముగుస్తాయి.





రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు, ప్రధాని మోడీలతో చీఫ్ ఇన్‌ఫర్మేషన్ కమిషనర్ బిమల్ జుల్కా

# గోషామహల్ స్టేడియంలో భారీ అగ్నిప్రమాదం

### సీజ్ చేసిన 30 వాహనాలు దగ్ధం

హైదరాబాద్,మార్చి6(ఆర్ఎన్ఎ): నగరంలోని గోషామహల్ పోలీస్ స్టేడియంలో నేటి తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం సంభవించింది. మంటలు పెద్దఎత్తున ఎగసిపడ్డాయి. ఈ మంటల్లో వివిధ కేసుల్లో సీజ్ చేసిన 30 వాహనాలు దగ్ధమయ్యాయి. మంటలను గుర్తించిన సెక్యూరిటీ సిబ్బంది పోలీసు అధికారులను అప్రమత్తం చేసింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుంది. రెండు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చింది. కాగా అగ్నిప్రమాదం ఎలా జరిగింది అనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఎవరైనా వీటిని తగులబెట్టారా అన్నది విచారిస్తున్నారు.





గోషామహల్‌లో అగ్నిప్రమాదం కారణంగా దగ్ధమైన పలు వాహనాలు

## డిప్లమా కోర్సులకు ఎప్రిల్ 4 చివరితేదీ

హైదరాబాద్,మార్చి6(ఆర్ఎన్ఎ): ప్రొఫెసర్ జయశంకర్ వర్సిటీలో వివిధ వ్యవసాయ, వ్యవసాయ ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సుల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించే పాలిసెట్-2020 ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఏప్రిల్ 4 చివరితేదీ అని రిజిస్ట్రార్ డాక్టర్ సుధీర్‌కుమార్ తెలిపారు. ఇందుకు స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్, ట్రైనింగ్ పాలిసెట్ నోటిఫికేషన్‌ను ఈ నెల 2న విడుదల చేసిందని వివరించారు. వర్సిటీ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కాలేజీల్లో అందిస్తున్న మూడేండ్ల వ్యవసాయ ఇంజినీరింగ్ డిఎ÷-లొమా, రెండేండ్ల వ్యవసాయ డిఎ÷-లొమా కోర్సుల్లో ప్రవేశాలను పాలిసెట్ ర్యాంకుల ఆధారంగా చేపడుతామన్నారు పాలిసెట్ ఫలితాల అనంతరం ప్రవేశాలు కల్పించేందుకు వర్సిటీ విడిగా ప్రకటన విడుదలచేస్తుందన్నారు. పాలిసెట్‌లో ర్యాంకు పొందిన అభ్యర్థులు నోటిఫికేషన్ ఆధారంగా ప్రవేశాల కోసం విధిగా దరఖాస్తులు చేసుకోవాలి.

# నిబంధన విధింపే అందుకు నిదర్శనం....!

నేటినిజం
శనివారం 7-3-2020

నేటి యువతలో కొరవడింది సమయపాలన. విద్యార్థులు, వారి అర్హత సామర్థ్యాల నిర్వహణ తప్పనిసరి పరీక్షల పట్ల వ్యక్తులకు గౌరవభావం ఉండితీరాలి. కానీ వాస్తవ పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. వయసుతో సంబంధం లేకుండా అనేకమంది పరీక్షల పేరు చెబితేనే వణికిపోతారు. పరీక్షకు అరగంట ముందువరకు పుస్తకాలతో కుస్తీపడిన వారు ఇలాంటి జంకును తొలగించి విద్యార్థులు ఉద్యోగార్థులు ఉత్సాహంగా పరీక్షల్లో తమ సత్తా చాటుకోవడానికి ముందుకురికేలా మలచడమే విద్యావ్యవస్థ విధి. సరిగ్గా ఆక్కడే అది ఘోరంగా విఫలమవుతోంది. తల్లితండ్రులు, ఉపాధ్యాయులు, అధికారులు, అందరూ ఈ దుర్వ్యవస్థకు భాధ్యులే. ఇలాంటి పరీక్షల వ్యవస్థను సంస్కరించడానికి పూనుకోవాల్సిన తరుణం ఇది. అందుకు విరుద్ధంగా అధికారులు తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాల వల్ల పరీక్షల వ్యవస్థ మరింత పతనావస్థకు చేరుకుంటోంది. ఒక్క నిముషం ఆలస్యం నిబంధన విధింపే అందుకు నిదర్శనం. ఈ నిబంధనపై నిరసన వ్యక్తమవుతుండటానికి కారణాలను విశ్లేషించాల్సింది. వాస్తవానికి ఏ రెండు గడియారాలు ఒకే సమయాన్ని చూపించవు. అసలు ఏది ఖచ్చితమైన సమయమో అందుకు అధికారులు ఏ గడియారాన్ని ప్రాతిపదికగా తీసుకుంటున్నారనేది కీలకమే! సమయపాలన ఎవరైనా విధిగా పాటించాలి. నిర్ణీత సమయానికి పని ప్రారంభించి అనుకున్న సమయానికి పూర్తిచేయగలిగిన వారు విజయాలు సాధిస్తారు. ఇతరులకు ఆదర్శప్రాయులవుతారు. దీనినుంచి వ్యక్తులు మినహాయింపులు ఆశించడం తగదు. అయితే అన్ని పరిస్థితులు తమ నియంత్రణలో ఉన్నవారే సమయపాలనలో విజయం సాధిస్తారు. దురదృష్టవశాత్తు ఇతరులపై ఆధారపడి కార్యకలాపాలు నిర్వహించాల్సి వచ్చినపుడు సమయపాలన అదుపు తప్పుతుంది.

సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవడానికి విద్యార్థులు అభ్యర్థులు ఎంతో తాపత్రయపడతారు. అయితే, అది పూర్తిగా వారి చేతుల్లో ఉండే విషయం కానే కాదు. ముఖ్యంగా పరీక్షలు జరిగే రోజుల్లో అనూహ్యమైన అడ్డంకులు ఎదురవుతుంటాయి. ఒక్క రవాణానే తీసుకుందాం. సొంతవాహనాలలో వచ్చేవారు సకాలంలో పరీక్షా కేంద్రానికి చేరుకోగలరు. రద్దీ ఎక్కువగా ఉంటే వారు కూడా ట్రాఫిక్ జామ్ లో ఇరుక్కుపోవచ్చు. ముఖ్యంగా పరీక్ష రోజుల్లో వేలమంది విద్యార్థులు వారి తల్లితండ్రులు ఒక్కసారిగా రోడ్లపైకి వస్తారు. అలాంటపుడు రద్దీ అవటం సర్వసాధారణం. అలాంటి సమయంలో ప్రభుత్వం నిర్వహించే ప్రత్యేక బస్సులు సైతం అనుకున్న సమయానికి గమ్యం చేరకపోవచ్చు. పరీక్షలకు వెళ్లడానికి బస్సుటాపులపై ప్రయాణించే విద్యార్థులు తల్లితండ్రుల ఇక్కట్లను చూస్తూనే ఉంటాం. కొందరు పెన్ను మర్చిపోవడం, మరికొంద్దరైతే ఏకంగా హాల్‌టికెట్లే మరచిపోయి రావడం,. వెంటనే గట్టిగా ఏడ్వడం, గోలచేయడం లాంటివి వర్ణనాతీతం. ఎపుడైతే నిర్ణీత సమయాన్ని మరింత కట్టుదిట్టం చేస్తారో అపుడే ఇలాంటి పొరపాట్లు జరుగుతాయి. కాస్త ప్రభుత్వం కూడా పట్టు విడుపు లాంటిది ఉపయోగించి విద్యార్థుల పడుతున్న క్షోభకు స్వస్తి పలకాలి.

## ధృవీకరణ పత్రాలు లేని వాహనాలతో తంటాలు

### రిజిస్ట్రేషన్ లేని వాహనాలతో అక్రమాలు
### పట్టుబడినప్పుడు ఎవరిదో తెలియని పరిస్థితి

హైదరాబాద్,మార్చి 6(ఆర్ఎన్ఎ): వాహనాలను కొనుగోలు చేసి ఏ మాత్రం పట్టించుకోకుండా రిజిస్ట్రేషన్ చేసుకోకుండా ఉండే వాహనాల యజమానులపై ఇకపై కఠినచర్యలు తీసుకోనున్నారు. నిర్లక్ష్యం చేసే వారిపై చర్యలు తప్పవని హెచ్చరిక చేస్తున్నారు. దీనివల్ల అ సాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారితో పాటు ఇతర ప్రాంతాలనుంచి వలసలు వచ్చి ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకుండా వాహనాలు నడిపే వారిపై ముమ్ముందు చర్యలు కఠినంగా ఉండే అవకాశాలు ఉన్నాయి. పట్టణ ప్రాంతాలే కాకుండా అత్యధికంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన వాహనాలను ఎలాంటి ధ్రువీకరణ పత్రాలులేకుండా నడుపుకుంటూ చెలామణి అవుతున్నారు. దీనివల్లఅనేక సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రధానంగా గ్రామీణ ప్రాంతానికి చెందిన వారు అధికంగా ఫైనాన్సుల ద్వారా వాహనాలను కొనుగోలు చేసి వాటిని రిజిస్ట్రేషన్ చేసుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. పట్టణ ప్రాంతాల వారు అధికంగా కార్లను, గ్రామీణ ప్రాంతాల వారు ద్విచక్ర వాహనాలను కొనుగోలు చేసి అలసత్వం ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం అతివేగం, అతిగా మద్యం తాగి వాహనం నడపటం ద్వారా ప్రమాదాలు పెద్దఎత్తున చోటు చేసుకుంటున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో మొదలుకొని జాతీయ రహదారులపై సైతం ద్విచక్ర వాహనాలతో పాటు కార్లు, ఇతర వాహనాలు సైతం ప్రమాదాలకు గురవుతున్నాయి. ఆ సమయంలో వాహనదారులు ప్రమాదాలకు గురైతే ఆ వాహన నెంబర్ల ద్వారా యజమానులతో పాటు ప్రమాదాలకు గురైన వారిని గుర్తించే అవకాశం ఉంటుంది.అయితే ప్రస్తుతం కొంతమంది వాహనదారులు రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో పాటు వాహనాలపై నెంబర్ ప్లేట్లను బిగించుకోకుండా విచ్చలవిడిగా ప్రయాణం సాగిస్తున్నారు. ప్రమాదాలకు గురైతే ఆ వాహనాలతో పాటు క్షతగాత్రులను సైతం గుర్తించడం కష్టతరంగా మారనుంది. ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయంతో అన్ని వాహనాలకు రిజిస్ట్రేషన్ చేయడం ద్వారా వాహనాలను గుర్తించే అవకాశం సులభతరం అవుతుంది. మార్చి 20 వరకు గడువు ఇచ్చిన ప్రభుత్వం ఆ తర్వాత ఈ నెలాఖరు వరకు గడువు పొడిగించింది. ఇక తుది సమయంగా ఏప్రిల్ నెలాఖరి వరకు సమయం ఇచ్చింది. ఆ తర్వాత ఇక రిజిస్ట్రేషన్‌కు తీసు కొచ్చినా ఆర్టీఓ కార్యాలయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రిజిస్ట్రేషన్ చేయవద్దని ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. మొత్తానికి వాహనాలను కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ విషయంలో అలసత్వం వహించిన వాహనదారులకు సమస్యలు తప్పేలా కనిపించడం లేదు.దీనికి తోడు పోలీస్ యంత్రాంగం చాలా పట్టణ ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించిన సందర్భంలో గుర్తింపులే ని వాహనాలు పట్టుబడిన విషయం తెలిసిందే. రిజిస్ట్రేషన్ లేకుండానే సంవత్సరాలు తరబడి నడుపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. వివిధ వాహనాల కంపెనీల డీలర్లు వాహనాలను విక్రయించడం మినహా వారిని సకాలంలో రిజిస్ట్రేషన్ చేయించుకునేలా ప్రోత్స హించడం లేదు. దీనికి తోడు పలు వాహనాలను వివిధ÷నాన్సుల నుంచి కొనుగోలు చేయడం, ఆ తర్వాత రిజిస్ట్రేషన్ విషయాన్ని మరిచిపోవడం, అంతేకాక సంబంధిత కంపెనీల డీలర్లు పట్టించుకోకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. సకాలంలో వారికి పత్రాలను అందించకపోవడంతో రిజిస్ట్రేషన్ జరగని పరిస్థితి ఏర్పడింది.

## ఎండిపోయిన నర్సాపూర్ చెరువు

### అడుగంటున్నతున్న భూగర్భజలాలు

నర్సాపూర్, మార్చి 6(ఆర్ఎన్ఎ): నియోజకవర్గ కేంద్రం నర్సాపూర్‌లో ఎప్పుడూ నీటి ఎద్దడి నెలకొనలేదు. రాయరావు చెరువులో ఎప్పుడు నీరుండడంతో పట్టణ పరిధిలో భూగర్భజలాలు కూడా పుష్కలంగా లభించేవి. అయితే ఈఏడాది నియోజకవర్గంలో వ్యాప్తంగా వర్షాలు కురియలేదు. దీంతో మొదటిసారి నర్సాపూర్ చెరువు ఎండిపోయింది. అదే సమయంలో పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తింది. పట్టణంలోని కొన్ని కాలనీల్లో నీటిని ట్యాంకర్లతో సరఫరా చేస్తున్నారు. మరోవైపు ఎండలు పెరిగితే భూగర్భ జలాలు మరింత పడిపోయి బోర్లు కూడా పూర్తిగా వట్టిపోయే పనిచేసే పరిస్థితి తలెత్తే అవకాశముంది. నర్సాపూర్ పట్టణంతో పాటు నియోజకవర్గంలోని గ్రామాల్లోనూ ఇదే దుస్థితి. ఈ విషయం ముందే గుర్తించిన ఎమ్మెల్యే మదన్‌రెడ్డి స్వయంగా సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు.నర్సాపూర్ నియోజకవర్గంలో తాగునీటి సమస్య జఠిలంగా మారుతోంది. మిషన్ భగీరథలో భాగంగా సింగూరు ప్రాజెక్టు నుంచి రావాల్సిన నీరు కొన్ని నెలలుగా నిలిచిపోయింది. ప్రాజెక్టులో నీరు అడుగంటడమే కారణం. ప్రస్తుతం ప్రజలు బోర్లపైనే ఆధారపడుతున్నారు. మరికొన్ని చోట్ల ట్యాంకర్లతో ప్రత్యామ్నాయంగా నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం ఎండలు ముదురుతుండడంతో పాటు భూగర్భజలాలు అడుగంటిపోయాయి. కాస్తో కూస్తో నీటిని పోస్తున్న బోర్లు కూడ్రా క్రమంగా వట్టిపోతున్నాయి. ముఖ్యమంత్రి వెంటనే స్పందించి గజ్వేల్ నియోజకవర్గంలోని కోమటిబండ నుంచి నర్సాపూర్ నియోజకవర్గానికి గోదావరి జలాలను సరఫరా చేసేందుకు అంగీకరించారు. పైపులైన్ వేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇందుకు అవసరమైన నిధులు కూడా వెంటనే మంజూరు చేస్తామన్నారు. పైపులైన్ల కోసం రూ.25కోట్లు కేటాయించినట్టు, టెండరు ప్రక్రియను చేపట్టాలని అధికారులను ఆదేశించినట్టు నర్సాపూర్‌కు వచ్చినప్పుడు మంత్రి హరీశ్‌రావు వెల్లడించిన విషయం తెలిసిందే. అందుకు అవసరమైన సంపును శివ్వంపేటలో నిర్మించాలని కూడా నిర్ణయించారు. నెలలోగా పనులు పూర్తిచేసి నియోజకవర్గ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చేస్తామని ప్రజలకు ఎమ్మెల్యే మదన్‌రెడ్డి భరోసా ఇస్తున్నారు. పనులు త్వరితగతిన పూర్తయితే వేసవిలో నీటి కటకట నుంచి గ్టటెక్కే అవకాశముంది. నియోజకవర్గంలో శాశ్వతంగా నీటి సమస్య తీరడం ఖాయం. ఒకవేళ పనులు ఆలస్యమైతే మాత్రం నియోజకవర్గ ప్రజలు ఈ వేసవిలో తాగు నీటి కోసం పడరాని పాట్లు పడకతప్పదు.

## కరోనా భయంతో ప్రైమరీ స్కూళ్లకు సెలవులు

### వెల్లడించిన ఢిల్లీ డిప్యూటి సిఎం మనీష్ సిసోడియా

న్యూఢిల్లీ,మార్చి5(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతున్న క్రమంలో ఢిల్లీ ప్రభుత్వం అప్రమత్తమైంది. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఢిల్లీలోని ప్రైమరీ స్కూల్స్‌ను మూసివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా ట్వీట్ చేశారు. కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టే చర్యల్లో భాగంగా, ముందు జాగ్రత్తగా ప్రైమరీ స్కూళ్లను ఈ ఏడాది మార్చి 31 వరకు మూ సివేస్తున్నట్లు ట్వీట్ చేశారు. ఈ సెలవులు ప్రభుత్వ, ఎయిడెడ్, ఎంసీడీ, ఎన్డీఎంసీ ప్రైమరీ స్కూళ్లకు వర్తించనున్నాయి. ప్రస్తుతం కరోనా వైరస్ 60 దేశాలకు వ్యాప్తి చెందింది. ప్రపంచ వ్యాప్తంగా 3 వేల మందికి పైగా ఈ వైరస్ బారిన పడి మృతి చెందారు. సుమారు 90 వేల మందికి పైగా కరోనా సోకింది. భారత్‌లో 30 పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి. ఇందులో 16 మంది ఇటలీ దేశస్థులు ఉన్నారు.

## ఎమ్మెల్సీ ఉప ఎన్నిక షెడ్యూల్ విడుదల

హైదరాబాద్,మార్చి6(ఆర్ఎన్ఎ): నిజామాబాద్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఉపఎన్నికకు షెడ్యూల్ విడుదలైంది. ఈ నెల 12వ తేదీన దీనికి సంబంధించిన నోటిఫికేషన్ విడుదల కానుంది. మార్చి 19వ తేదీ వరకు అభ్యర్థులు నామినేషన్లు వేయవచ్చు. 20వ తేదీ రోజు ఎన్నికల అధికారులు నామినేషన్లను పరిశీలిస్తారు. ఏప్రిల్ 7వ తేదీన ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఏప్రిల్ 9వ తేదీ రోజు కౌంటింగ్ జరుగుతుంది. ఏప్రిల్ 13వ తేదీ రోజు వరకు ఈ ఎన్నికకు సంబంధించిన ప్రక్రియ ముగుస్తుందని అధికారులు తెలిపారు. భూపతిరెడ్డిపై అనర్హత వేటు కారణంగా ఖాళీ అయిన ఎమ్మెల్సీ స్థానానికి ఈ ఎన్నిక జరుగుతుంది.

# ఆందోళన కలిగిస్తున్న ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరికలు

హైదరాబాద్, మార్చి 6:కరోనాపై చూసీచూడనట్లుగా వ్యవహరిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని, ప్రపంచ ఆరోగ్య సంక్షోభానికి దారితీసే ప్రమాదముందని ప్రపంచ ఆరోగ్య సంస్థ చేసిన హెచ్చరిక ఇప్పుడు ప్రభుత్వాలకు కనువిప్పు కావాలి. ఇప్పటికే ప్రపంచ దేశాలకు కరోనా వేగంగా విస్తరిస్తుంది. చైనాతో పోలిస్తే కోవిడ్ 19 వైరస్ 17 రెట్లు వేగంగా వ్యాప్తిస్తున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. నిర్లక్ష్యం వహించవద్దంటూ.. ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించింది. తక్షణం అన్ని చర్యలు తీసుకోవాలని సూచించింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే, ప్రపంచ ఆరోగ్య సంక్షోభానికి దారితీసే ప్రమాదముందని హెచ్చరించింది. కేసుల నమోదు, మరణాలతో సంబంధాలు లేకుండా తక్షణమే అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించింది. చూసీచూడనట్లుగా వ్యవహరిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని తెలిపింది. విదేశాల నుండి వచ్చే ప్రయాణీకులకు పరీక్షల్ని నిర్వహించడం, శుభ్రత విషయంలో ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి చర్యలు తక్షణమే చేపట్టాలని సూచించింది.నిన్న, మొన్నటి వరకు చైనాలో కనిపించిన ప్రమాదకర పరిస్థితులు ఇప్పుడు ఇరాన్, ఇటలీలో కనిపిస్తున్నాయని, ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తపరిచింది. యూరోపియన్ ఐ యూనియన్‌లో ఎక్కడా లేనివిధంగా మరణాలు నమోదవుతున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం.. ఇటలీలో ఇప్పటివరకు కరోనా బారినపడి 148 మంది చనిపోయారు. దేశవ్యాప్తంగా 3,850 కరోనా కేసులు నమోదయ్యాయి. ఇటలీ తర్వాత ఇరాన్‌లో పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఇక్కడ 107 మంది చనిపోయారు. కరోనా వైరస్ యూరప్, అమెరికా, భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తుండడంతో ఆయా దేశాలు విదేశీ ప్రయాణాలపై ట్రావెల్ అడ్వైజర్లను జారీ చేస్తున్నాయని, విదేశాల నుంచి భారత్‌కు వచ్చే క్లయింట్లు కూడా తమ ప్రయాణాన్ని వాయిదా వేసుకుంటున్నారని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. కాగా అంతర్గతంగా నిర్వహించే అన్ని ఈవెంట్లను, ఫంక్షన్లను హైదరాబాద్‌లోని ఐటీ కంపెనీలు రద్దు చేశాయి.

ఇప్పటికే మార్చి 8న నిర్వహించే మహిళా దినోత్సవాన్ని కొన్ని కంపెనీలు రద్దు చేశాయి. తాజాగా హైదరాబాద్‌లో కేసుల సంఖ్య పెరగడం ఆందోళన కలిగిస్తోంది. డచ్ కంపెనీ డీఎస్ఎంలో ఉద్యోగికి కరోనా సోకినట్లు ఆ కంపెనీ ప్రకటించి.. ఉద్యోగులను ఇంటికి పంపించడంతో హైదరాబాద్‌లోని ఐటీ కంపెనీలు మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి. శానిటైజేషన్ చర్యలను మరింత పటిష్ఠంగా అమలు చేయడంతో పాటు ప్రతి ఉద్యోగిని స్క్రీనింగ్ చేసి లోపలకు అనుమతి స్తున్నాయి. మరోవైపు క్లయింట్ల వద్దకు వెళ్లి ప్రాజెక్టులను పర్యవేక్షించే వారి విదేశీ ప్రయాణాలను వాయిదా వేస్తున్నాయి. అధిక రిస్క్ ఉన్న దేశాల నుంచి వచ్చిన ఉద్యోగులు రెండు వారాల పాటు ఇంటి వద్దే ఉండి అక్కడి నుంచి పని చేయాలని పెగా సిస్టమ్స్ ఉద్యోగులను కోరింది.ప్రాధాన్యం లేని వ్యాపార ప్రయాణాలను నిలిపివేయాలని సూచించారు. ప్రస్తుతం జనాన్ని బెంబేలెత్తిస్తున్న ఏకైక మాట కరోనా. చైనాలో మొదలై ప్రపంచంలోని పలు దేశాలకు విస్తరించిన ఈ వ్యాధికారక జీవి (కోవిడ్-19) శరవేగంగా ఇతరులకు చేరుతుండడమే ఈ ఆందోళనకు కారణం. మన రాష్ట్రంలో ఇంకా అధికారికంగా కేసులేవీ నమోదుకాకున్నా అదిగో పులి అంటే ఇదిగో తోక' అన్న చందంగా ఊహాగానాలు విస్తరిస్తుండడంతో జనం భయాందోళనకు గురవుతున్నారు. రోనా ప్రపంచవ్యాప్తంగా విస్తరించడంతో ఐటీ కంపెనీలు తమ ఉద్యోగుల ప్రయాణాలను నిలిపి వేసున్నాయి. ఈ ప్రభావం ఐటీ కంపెనీలపై పడుతుంది. గత పది రోజుల్లో భారత్ రావాలనుకున్న ఖాతాదారులందరూ తమ ప్రయాణాలను రద్దు చేసుకున్నారు. కరోనా ప్రభావం ఎంత తొందరగా తగ్గితే పరిశ్రమకు అంత మంచిది. ఎండాకాలం వచ్చేసింది. ఇప్పటికే ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఇది భారత్‌కు అనుకూల పరిస్థితి. త్వరగా కరోనా ప్రభావం తగ్గుతుందని భావిస్తున్నారు.సామాజిక మాధ్యమాల్లో వార్తలు వెల్లువెత్తుండడంతో వైరస్‌తోనే సహజీవనం చేస్తున్నామేమోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రచారం, వాస్తవం మాట పక్కన పెడితే కరోనా వైరస్ తెలుగు రాష్ట్రాల్లోనూ విస్తరిస్తున్నట్టు డేంజర్ బెల్స్ మోగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో వైరస్‌పై అవగాహన ఏర్పర్చుకుని ముందు జాగ్రత్తలు తీసుకోవడంతో ముప్పుకు దూరం కావచ్చు అంటున్నారు వైద్య నిపుణులు.ప్రపంచాన్ని ప్రస్తుతం బెంబేలెత్తిస్తున్న కరోనా వైరస్ (కోవిడ్-19) అంటు వ్యాధి. ఒకరి నుంచి మరొకరికి శరవేగంగా విస్తరించే అంటు రోగాలతో చాలా ప్రమాదం. చాలా రూపాల్లో అంటువ్యాధులు వ్యాపిస్తాయి. ఆహారం తీసుకునే సమయంలో చేతులు పరిశుభ్రంగా లేకపోవడం, తిన్న ఆహారంలో నాణ్యత పాటించక పోవడం, తరచూ చేతులు నోటిలో పెట్టుకోవడం, రోగుల పక్కన కూర్చోవడం, వారితో కరచాలనం చేయడం, బహిరంగ మలమూత్ర విసర్జన చేయడం వంటి కారణాలతో వైరస్ వ్యాప్తి చెందుతుంది. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో కరోనా కలకలం ఎక్కువగా ఉంది. నగరంలోనూ బాధితులున్నారన్న అనుమానాలు మొదలయ్యాయి. మొత్తంగా మనమెంత కంగారు పడుతున్నా ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరికలు భయాందోళన కలిగిస్తున్నాయి. దీనిపై కేంద్ర స్థాయిలోనే కఠిన చర్యలకు ఉపక్రమించాలి

# పరిశుభ్రతను పాటిస్తే కరోనాకు దూరం

### పెంపుడు జంతువులను ముట్టుకున్నా చేతులు శుభ్రం చేసుకోవాలి
### జనసమర్థానికి దూరంగా ఉండాలని సూచిస్తున్న వైద్యులు

హైదరాబాద్,మార్చి6(ఆర్ఎన్ఎ): కరోనాపై చేస్తున్న హెచ్చరికల నేపథ్యంలో వైద్యుల సూచనలు పాటించాలని ప్రభుత్వం తెలిపింది. వైరస్ సోకిన తర్వాత నాలుగు నుంచి 14 రోజుల తర్వాతగాని వ్యాధి లక్షణాలు బయటపడవు. దగ్గు, జలుబు, జ్వరంతోపాటు శ్వాస తీసుకోవడం కష్టంగా ఉన్న వారు మాత్రం తక్షణం డాక్టర్‌ను సంప్రదించాలి. వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి. ఇటు వంటి లక్షణాలు ఉన్న వారంతా కరోనా వ్యాధిగ్రస్తులు కాదని గ్రహించాలి. కరోనా వ్యాధి లక్షణాలు ఉన్న వారు బయట తిరగరాదు. కుటుంబ సభ్యులతో కూడా కలవకుండా ఓ గదిలో ఉండడం మంచిదంటున్నారు. మరోవైపు ఐటిపై దీనిప్రభావం కారణంగా ఐటి ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. హైదరాబాద్‌లోని కార్యాలయాన్ని తాత్కాలికంగా మూసివేసి ఇంటి నుంచి పని చేయాలని ఉద్యోగులను కాగ్నిజెంట్ కోరినట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌లోని రహేజా మైండ్‌స్పేస్ పార్కులో కాగ్నిజెంట్ కార్యాలయం ఉంది. ఈ మేరకు ఉద్యోగులకు ఈ-మెయిల్ పంపినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. విజయవాడలో రెండు కేసులు, విశాఖలో మూడు కేసులు, తూర్పుగోదావరిలో ఒకరికి వైరస్...ఇలా ప్రచారం సాగడం ఆందోళన కలిగిస్తోంది. ఆసుపత్రులకు వెళ్లి రోగులను పరామర్శించి వచ్చినప్పుడు కచ్చితంగా శుభ్రత పాటించా లంటున్నారు.పెంపుడు జంతువులను తాకినా, కోళ్లు, మేకలు, గొర్రెలను తాకినా వెంటనే చేతులు కడుక్కోవాలి. బయట ప్రాంతాల్లో వస్తువులపై చేతులు పెట్టరాదని సూచిస్తున్నారు. కరోనా వైరస్ ఏ కారణం వల్లనైనా గాల్లో కలిస్తే రెండు గంటలపాటు సజీవంగా ఉంటుంది. ఆ సమయంలో జాగ్రత్త అవసరం. గాలిలోని తేమ, దుమ్ము, ధూళి కణాలతో ప్రమాదకరమైన వైరస్ ఆయా వస్తువులపైకి చేరుతాయి. వాటిని తాకిన వారికి వైరస్ చేరుతుంది. అలాగే బాధితుల చెయ్యి తగిలినా వ్యాధి సోకుతుంది. వీలైనంత వరకు చేతులకు గ్లౌజులు పెట్టుకోవడం ఉత్తమం. జనం ఎక్కువగా ఉన్న చోటుకు వెళ్లకూడదు. ముఖ్యంగా బస్‌స్టేషన్లు, రైల్వేస్టేషన్లు, షాపింగ్‌మాల్స్, సినిమా థియేటర్లకు దూరంగా ఉండాలి. బస్సు, ఆటో, ట్రక్కర్లలో ప్రయాణించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. చేతితో కంటిని నలపడం, పుసులు తీయడం, చేతితో తుడవడం చేయకూడదు. దీనివల్ల చేతిలో వైరస్ కంటిలోకి చేరే ప్రమాదం ఉంది. అవసరమైతే తగిన జాగ్రత్తలు తీసుకుని కంటిని శుభ్రం చేసుకోవాలి. పరిచయస్తులు కలిస్తే మర్యాదపూర్వకంగా షేక్ హ్యాండ్ ఇవ్వడం అలవాటు. ఆలింగనం కూడా చేసుకుంటాం. ప్రస్తుతం ఇవేవీ మంచిది కాదు. వీలైనంత వరకు తెలిసిన వారికి నమస్కారంతో సరిపెట్టాలి. విదేశీయులు, విదేశాలకు వెళ్లవచ్చిన వారితో మరీ అప్రమత్తంగా ఉండాలి.ముక్కు, చెవి, నోటిలో వేళ్లుపెట్టుకుని కెలకడం వంటివి చేయకూడదు. చేతికి గ్లౌజులు, ముఖానికి మాస్క్ ధరించడం చాలా శ్రేయస్కరం. కార్యాలయాలు, పరిశ్రమలు, వాణిజ్య సంస్థల్లో పనిచేసేవారు వీటిని తప్పక ధరించాలి. కిల్లీ, జర్దా, పాన్‌పరాగ్ వంటి అలవాట్లు ఉన్నవారు ఎక్కడ పడితే అక్కడ ఉమ్మేయకూడదు. ధూమపానం అలవాటు ఉన్న వారు బహిరంగ ప్రదేశాల్లో కాల్చకూడదు. వైరస్ వ్యాప్తిలో చేతులు కీలకపాత్ర పోషించే అవకాశం ఉంది. అందువల్ల చేతులను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఆల్కహాల్ సంబంధిత శానిటైజర్లు వాడడం వల్ల 99 శాతం సూక్ష్మ క్రిములు నాశనమవుతాయి. సబ్బు, శానిటైజర్లు లేకుంటే ఉప్పు, నిమ్మరసం తోనైనా చేతులు కడుక్కోవచ్చు. ఉదయం స్నానం చేసినప్పుడు సబ్బుతో కడుక్కున్నాం కదా అనుకోకూడదు. రోజంతా దైనందిన జీవితంలో అనేక పనులు చేస్తాం. ఎవరెవరినో కలుస్తాం. షేక్‌హ్యాండ్ ఇస్తాం. కావున వీలైనన్ని ఎక్కువసార్లు చేతులు కడుక్కోవాల్సిందేనంటున్నారు.

# వాతావరణంలో అనూహ్య మార్పులు

### ప్రబులుతున్న విషజ్వరాలు
### ముదురుతున్న ఎండలతో జనం బెంబేలు

ఆదిలాబాద్,మార్చి6(ఆర్ఎన్ఎ): ఇన్నాళ్లు చలితో వణికిపోయిన జిల్లా వాసులను ముదురుతున్న ఎండలు చెమటలు పట్టిస్తున్నాయి. వాతావరణంలో భారీ మార్పులు చోటుచేసుకోవడంతో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనం విష జ్వరాల భారిన పడి వణికి పోతున్నారు. ఉట్నూర్, ఇంద్రవెల్లి, ఇచ్చోడ, గుడిహత్నూర్, బజార్ హత్నూర్, బోథ్ మండలాల్లో విషజ్వరాల ప్రభావం అధికంగానే కనిపిస్తుంది. ఈ యేడు వేసవి ప్రారంభంలోనే ఉష్ణోగ్రతల తీవ్రత ఈ స్థాయిలో ఉండడంతో జనాలు బెంబేలెత్తి పోతున్నారు. అంతుచిక్కని జ్వరాలతో జనం ఆసుపత్రుల పాలవుతున్నారు. వాతావరణం లో వచ్చిన మార్పులతోనే విషజ్వరాలు పెరిగాయని వైద్యులు పేర్కొంటున్నారు. జిల్లా గరిష్ట పగటి ఉష్ణోగ్రతలు 35.8 డిగ్రీ లుగా నమోదు కాగా 18.7కనిష్ట ఉష్ణోగ్రత లు నమోదయ్యాయి. సాధారణంగా జిల్లాలో మూడు కాలాలు అధికంగానే ప్రభావాన్ని చూపుతాయి. గత వారం రోజులుగా జిల్లాలో ఎండలు తీవ్రత పెరగడంతో జనం బెంబేలెత్తుతు న్నారు. జిల్లాలో ముదురుతున్న ఎండలు, ఉక్కపోత పెరిగి పోవడంతో ఉపశమనం పొందేందుకు ప్రజలు ప్రత్యామ్నాయాలను ఆశ్రయిస్తున్నారు. రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు జిల్లాలో నమోదవుతున్నాయి. గతేడు కంటే ఈ సారి గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

చలి కాలంలో రికార్డు స్థాయిలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కాగా ఈ యేడు మార్చి మొదటి వారంలోనే గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గతేడు వేసవిలో అత్యధికంగా 46.4డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైన దాఖలాలు ఉన్నాయి. వేసవి ప్రారంభంలోనే ఈ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదైతే రాబోయే ఏప్రిల్, మే మాసాలలో పరిస్థితులు ఎలా ఉంటాయోనని జనం బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం 10గంటల నుంచే భానుడు భగ భగ మండుతూ తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. మధ్యాహ్న సమయంలో కొందరు మహిళలు, చిన్న పిల్లలు గోడుగు సహాయంతోనే బయటకు వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడు తున్నాయి. ఎండలు ముదురుతున్న నేపథ్యంలో వేసవి పరిస్థితులకు అనుగుణంగా జనం ఏర్పాట్లను చేసుకుంటున్నారు. ఇప్పటికే శీతల పానీయాల కేంద్రాలు ఏర్పాటు కావడంతో చల్లని పానీ యాలను తాగుతూ సేదతీరుతున్నారు. కొత్త కూలర్లు, ఫ్రిజ్‌లను కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపడంతో కూలర్ తయారీ షాపులకు భలే గిరాకీ పెరుగుతుంది. ఇండ్ల పైకప్పులు, ఇంటి ముందు చల్లని పందిర్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. అలాగే రైతులు వేసవిలో తీసుకునే జాగ్రత్తలు, పండించే పంటల పై దృష్టి సారిస్తున్నారు. మొత్తానికి పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు అనువుగా ఏర్పాట్లను చేసుకునే పనిలో ప్రజలు నిమగ్నమయ్యారు. రోజుకు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రత లతో పాటు కూరగాయల ధరలు కూడా అ మాంతంగా పెరిగి పోతున్నాయి. గత మూడు నాలుగు రోజులుగా మార్కెట్‌లో అన్ని కూరగాయల ధరలు పెరిగి పోయి ఉష్ణోగ్రతలకు ఉడుకుతున్నాయి. మండుతున్న ఎండలు కూరగాయల దిగుబడులపై ప్రభావం చూపుతున్నాయి. వేసవి కాలం ఇంకా ప్రారంభం కాక ముందే కూరగాయల ధరలు రెండింతలు కావడంపై కొనుగోలు దారులు ఆందోళనకు గుర వుతున్నారు.

## ఎసిబి వలలో గ్రామ కార్యదర్శి

### లంచం తీసుకుంటుండగా పట్టివేత

రాజన్న సిరిసిల్ల,మార్చి6(ఆర్ఎన్ఎ): కోనారావుపేట మండలం ఎగ్లాసుపూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. 2019 ఏప్రిల్ 15వ తేదీన పంచాయతీ కార్యదర్శి ఉద్యోగం పొందిన ప్రవీణ్ గత తొమ్మిది నెలలుగా ఎగ్లాసుపూర్ గ్రామంలో విధులు నిర్వహిస్తున్నాడు. గ్రామానికి చెందిన వేములవాడ స్వామి అనే రైతు ఆరు నెలల క్రితం ఇంటి నిర్మాణం కోసం అనుమతి ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్నాడు. ఇంటి నిర్మాణానికి అనుమతి ఇవ్వని కార్యదర్శి లంచం ఇవ్వాలని డిమాండ్ చేయడంతో స్వామి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఈ రోజు మండల పరిషత్ కార్యాలయంలో రూ. 5వేల లంచం తీసుకుంటూ ఏసీబీ డీఎస్పీ కె. భద్రయ్య ఆధ్వర్యంలోని సిబ్బంది రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసుకున్న ఏసీబీ అధికారులు లంచం ఇవ్వడం, లంచం తీసుకోవడం నేరమని ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే తమకు ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## అమ్మఒడి సాయం కోసం ఎదురుచూపు

సిరిసిల్ల,మార్చి6(ఆర్ఎన్ఎ): కేసీఆర్ కిట్ వంటి ప్రోత్సాహం, ఆసుపత్రుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో జిల్లాలో ప్రసవాల సంఖ్య పెరుగుతోంది. కానీ అమ్మకు మాత్రం ప్రోత్సాహం కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. అమ్మఒడి ప్రోత్సాహం కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలపై నమ్మకం పెరుగుతోంది. గర్భిణులు, బాలింతలకు అమ్మఒడి పథకం ద్వారా ఆర్థిక సాయంలో మాత్రం జాప్యం జరుగుతోంది. బకాయిల కోసం గర్భిణిలు, బాలింతలు ఎదురు చేస్తూనే ఉన్నారు.

జిల్లావ్యాప్తంగా అమ్మ ఒడి పథకం ప్రారంభమైన నాటినుంచి గర్భిణులు సేవలు పొందుతున్నారు. నాలుగు విడతలుగా అందించే సేవలకు నగదు ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు. మొదటి విడతలో రూ.3 వేలు, రెండో విడతలో మగబిడ్డకు రూ.4 వేలు, ఆడబిడ్డకు రూ.5 వేలు, మూడోవిడతలో రూ.2 వేలు, నాలుగోవిడతలో రూ.3 వేలు జమచేస్తారు. అమ్మఒడితో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరుగుతోంది. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రసవాలను పోలిస్తే ప్రైవేట్ రంగంలోనే సిజేరియన్లు పెరిగాయి. ప్రసవాలు పెరుగుతున్నా ప్రోత్సాహక సక్రమంగా అందకపోవడంపై నిరాశచెందుతున్నారు.

## ప్రభుత్వ స్కూళ్లలో మళ్లీ కంప్యూటర్ విద్య

### -నివేదిక సిద్ధం చేసిన విద్యాశాఖ అధికారులు

కామారెడ్డి,మార్చి 6(ఆర్ఎన్ఎ): జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో వచ్చే ఏడాది నుంచి కంప్యూటర్ విద్యను అమలు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ ఆధారిత విద్యావిధానం అటకెక్కిం ది. ఐదేళ్లపాటు నిర్వహణ బాధ్యతలు స్వీకరించిన కాంట్రాక్ట్ సంస్థల గడువు కొన్నేళ్ల క్రితమే ముగిసింది. ప్రభుత్వ పాఠశాలల్లో మళ్లీ కంప్యూటర్ విద్యను అమలు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం అందించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలు స్తోంది. జిల్లాలో ఏ పాఠశాలలో కంపూటర్లు ఉన్నాయి? ఎన్ని పని చేస్తున్నాయి? ఎన్ని పాఠశాలల్లో అవసరం..? అనే ప్రతిపాదనలు జిల్లా విద్యాశాఖ ప్రభుత్వానికి పంపించింది. ఎప్పటి నుంచి పాఠశాల ల్లో విద్యార్థులకు కంప్యూటర్ విద్య దూర మైంది. మళ్లీ వాటికి మరమ్మతులు చేసి, మి గతా పాఠశాలల్లో కొత్త వాటిని ఏర్పాటు చే సే ఆలోచనలో ప్రభుత్వం ఉంది.ఉన్నతాధికారులు జిల్లాలోని పాఠశాలలు, కంప్యూటర్ వి ద్యకు సంబంధించి వివరాలు సేకరించారు. వచ్చే విద్యా సం వత్సరం నుంచి ప్రభుత్వం కంప్యూటర్ విద్యను అమలు చేసే ఆలోచనలో ఉంది. కంప్యూటర్ విద్యతో విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు కంప్యూటర్ విద్యను బోధించే వారు. 2008 సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా కంప్యూటర్ విధానాన్ని ప్రవేశపె ట్టారు. ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలలకు పది చొప్పున కంప్యూటర్లు, యూపీఎస్, ప్రింటర్లు అందజేశారు. తెలుగు, గణితం, ఇం గ్లీష్ పరిసరాల విజ్ఞానం పాఠాలు సులభమైన రీతిలో ఆడియో ద్వారా బోధించే వారు. విద్యార్థులకు నెలవారీ పరీక్షలు కూడా కంప్యూటర్‌లోనే నిర్వహించేవారు. కంప్యూటర్ విద్య అటకెక్కడంతో లక్షలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన కంప్యూటర్లు, జనరేటర్లు మూలన పడ్డాయి. ఐదారేళ్ల నుంచి విద్యాశాఖ పట్టించుకోకపోవడంతో విద్యార్థులు కంప్యూటర్ విద్యకు దూరమవగా, కంప్యూటర్ ప్యాకల్టీలు ఉపాధి కోల్పోయారు. దీనిని పునరుద్ధరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు నిపుణులు కోరుతున్నారు.ప్రస్తుతం ఏ ఒక్క పాఠశాలలో కూడా కం ప్యూటర్లు పని చేయడం లేదు. దీంతో అవి వృథాగా మారాయి. ప్రస్తుతం జిల్లాలోని అన్ని ఉన్నత ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేసేలా చూడాలని అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక పంపారు.

## ఇంటర్ విద్యార్థులకు వెసలుబాటు

### మాస్కులు ధరించినా పరీక్షహాలుకు అనుమతి

హైదరాబాద్,మార్చి6(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో కరోనా వైరస్ అనుమానుతుల సంఖ్య పెరుగుతుండటంతో ప్రభుత్వం అప్రమత్తం అయ్యింది. అనుమానితులకు పరీక్షలు నిర్వహిస్తోంది. ఇదే సమయంలో ఇంటర్ పరీక్షలు ప్రారంభం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. విద్యార్థులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా చర్యలు చేపట్టింది. పరీక్షల నిర్వహణ నిబంధనల్లో మార్పులు చేసింది. విద్యార్థులు మాస్కులను ధరించి పరీక్షలకు హాజరయ్యేందుకు అనుమతిస్తున్నట్టు అధికారులు తెలిపారు. అంతేకాదు వారు తమ సొంత వాటర్ బాటిల్ ను పరీక్షా హాల్ లోకి తీసుకుని రావచ్చన్నారు. మరోవైపు జ్వరం, దగ్గు, జలుబుతో బాధపడుతున్న విద్యార్థులను విడిగా మరో గదిలో కూర్చోబెట్టి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు అధికారులు. దీనిపై అక్కడి ఇన్ చార్జ్, ఇన్విజిలేటర్లు సొంతంగా నిర్ణయం తీసుకుంటారని చెప్పారు.

## హామీలు నెరవేర్చని టీఆర్ఎస్ సర్కార్

### -ఇందిరాపార్క్ వద్ద ధర్నాలో టిడిపి నేత రమణ

హైదరాబాద్,మార్చి6(ఆర్ఎన్ఎ): టీఆర్ఎస్ ప్రభుత్వం.. ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించి పాలిస్తోందని టిడిపి విమర్శించింది. అనేక హామీలతోద్దెనెక్కిన కెసిఆర్ ప్రజలు వంచనకు గురి చేశారని అన్నారు. అందుకే ఇందిరా పార్కు వద్ద ధర్నా చేపట్టామని టిడిపి తెలంగాణ అధ్యక్షుడు ఎల్.రమణ అన్నారు. స్థానిక సమస్యలను బహిర్గతం చేయాలనే అన్ని జిల్లాల నుంచి నాయకులను ఆహ్వానించామన్నారు. పారిశుద్ధ్య కార్మికులు ఆందోళన సమయంలో ముఖ్యమంత్రి కెసిఆర్ వారిని ప్రత్యక్ష దేవుళ్లు అన్నారని, తర్వాత వారిని దయ్యాలు అని మాట్లాడారని విమర్శించారు. సీఎం ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తున్నారన్నారు. ఆర్టీసీ సమ్మె సమయంలో కార్మికులను ఇబ్బంది పెట్టిన కెసిఆర్..సమ్మె అనంతరం చార్జీలు పెంచి ప్రజలను ఇబ్బంది పెటారన్నారు. అన్ని సమస్యలపై చర్చించే ప్రయత్నం చేస్తామని ఎల్. రమణ తెలిపారు. హామీలను అమలు చేయాలని కోరితే పట్టించుకోవడం లేదన్నారు. అవినీతి పెరిగిందని అన్నారు. టీఆర్ఎస్ మేనిఫెస్టోలో 22 లక్షల మందికి ఇళ్లు ఇస్తామన్నారు..30 వేల మందికి మాత్రమే ఇచ్చారని టీడీపీ నేత రావుల చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. కల్వకుర్తి, భీమా, నె÷-టటెంపాడు ప్రాజెక్టలు పడకేశాయని విమర్శించారు. విద్యుత్ సంస్థ అప్పుల్లో కూరుకుపోయిందన్నారు. రాష్ట్రంలో 3 వేల స్కూళ్లు మూతపడ్డాయని తెలిపారు. విభజన హామీలపై కేంద్రాన్ని అడిగే ధైర్యం కేసీఆర్‌కు లేదన్నారు.

తెలంగాణలో ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద టీటీడీపీ ఆధ్వర్యంలో గురువారం మహాధర్నా నిర్వహించారు. కరోనా వైరస్ భయం వల్ల కరచాలనం వద్దు...నమస్కారం ముద్దు అంటూ నేతలు నినాదాలు చేశారు. కార్యకర్తలు మాస్కులు ధరించి ధర్నాకు హాజరయ్యారు. తెలుగు మహిళా అధ్యక్షురాలు జ్యోత్స్న, నర్సిరెడ్డి, బక్క నర్సింములు, దుర్గ ప్రసాద్ టీటీడీపీ రాష్ట్ర జిల్లా నాయకులు, కార్యకర్తలు ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోత్స్న మాట్లాడుతూ తెలంగాణలో ఆడబిడ్డలు సురక్షితంగా ఉన్నారని కేసీఆర్ చెప్పగలవా అంటూ ప్రశ్నించారు. మహిళా యూనివర్సిటీల మాట మరుగున పడిందని, మహిళా కమిషన్ లేదని విమర్శించారు. తెలంగాణలో ఆరేళ్ళ నుంచి మహిళలకు సంబంధించిన ఒక్క సమీక్ష కూడా జరగలేదని ఆమె మండిపడ్డారు. మహిళల గురించి మాట్లాడే ఏకైక పార్టీ టీడీపీ అని అన్నారు. రాజ్యాధికారం మహిళల చేతిలోకి తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని...అది టీడీపీతోనే సాధ్యమని జోత్స్న స్పష్టం చేశారు.

# గవర్నర్‌తో అబద్దాలు పలికించారు

## –గవర్నర్ ప్రసంగంపై బిజెపి విమర్శలు

హైదరాబాద్,మార్చి6(ఆర్ఎన్ఎ): టీఆర్ఎస్ ప్రభుత్వం గవర్నర్ తమిళిసైతో అసెంబ్లీలో అబద్దాలు పలికించిందని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ విమర్శించారు. శుక్రవారం ఆయన మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ టీఆర్ఎస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఒక్కదానిని కూడా నిలబెట్టుకోలేకపోయిందని విమర్శించారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతామన్నారు. బీజేపీ ఎమ్మెల్సీ రామచంద్రరావు మాట్లాడుతూ గవర్నర్ ప్రసంగంలో కొత్తగా ఏమీ లేదని, పాత సీసాలో కొత్త సారా అనే సామెతలా ఉందన్నారు. విద్యార్థులను, నిరుద్యోగులను నిరాశపరిచే విధంగా గవర్నర్ ప్రసంగం ఉందన్నారు. నిరుద్యోగ భృతి విషయం ప్రస్తావించలేదని, ప్రభుత్వం చెప్పేవి వినివిని చెవుల నుంచి రక్తాలు కారుతున్నాయన్నారు. గవర్నర్ ప్రసంగం ద్వారా అన్ని రంగాల్లో ప్రభుత్వం వైఫల్యం చెందినదని స్పష్టంగా తెలుస్తోందని రామచంద్రరావు విమర్శించారు.

# కెటీఆర్ అక్రమాలను ప్రశ్నించినందుకే రేవంత్ అరెస్ట్

## –మండిపడ్డ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

హైదరాబాద్,మార్చి6(ఆర్ఎన్ఎ): నిబంధనలకు విరుద్ధంగా 25 ఎకరాల్లో టీఆర్ఎస్ నాయకులు ఫామ్‌హౌస్ నిర్మాణం చేపట్టారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ కేటీఆర్ తన విలాసవంతమైన జీవితం కోసం 111 జీవోను ఉల్లంఘించారని మండిపడ్డారు. కేటీఆర్ ఉల్లంఘనలను బయట పెట్టినందుకే రేవంత్‌రెడ్డిని అరెస్టు చేయడం కరెక్ట్ కాదని ఆయన అన్నారు. అసలు దొంగలను వదిలేసి ప్రజా ప్రతినిధులను అరెస్టు చేస్తారా అని ప్రశ్నించారు. 25 ఎకరాల్లో కేటీఆర్ ఫామ్‌హౌస్ ఎందుకని ప్రశ్నిస్తూ పేదలకు డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు ఏమయ్యాయని నిలదీశారు. కేటీఆర్‌పై 111 జీవో ఉల్లంఘన చర్యలు తీసుకోవాలని జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

# రైతు సమస్యలపై అసెంబ్లీలో నిలదీస్తా: జగ్గారెడ్డి

హైదరాబాద్,మార్చి6(ఆర్ఎన్ఎ): అసెంబ్లీ సమావేశాల్లో సంగారెడ్డి రైతుల పక్షాన పలు అంశాలపై ప్రశ్నిస్తానని కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ.. సింగూరు–మంజీర నీళ్లు సంగారెడ్డికి అందకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఆనాటి నుంచి ఇప్పటి వరకు హరీష్ రావు మంత్రిగా కొనసాగుతున్నారని.. తాను గత అసెంబ్లీ సమావేశాల నుంచి సంగారెడ్డికి నీళ్లు కావాలని అడిగినా పట్టించుకోలేదని మండిపడ్డారు. సంగారెడ్డిలో హరీష్‌రావు కొన్ని గ్రామాలను దత్తత తీసుకున్నారని... ఆ ప్రాంతంలో 70 శాతం రైతులకు రుణమాఫీ కాలేదని విమర్శించారు. పంటనష్ట పరిహారం కూడా ఇవ్వడం లేదన్నారు. లాయర్లకు నెలకు రూ.5వేలు ఇస్తామన్న ప్రభుత్వం మాట తప్పిందని జగ్గారెడ్డి ధ్వజమెత్తారు.

# తాడ్వోల్ మండలంలో విషాదం

## చెరువులో ముగ్గురు అక్కాచెల్లెళ్ల మృతదేహాలు

## తండ్రే హతమార్చాడని ఆరోపణ

కామారెడ్డి,మార్చి6(ఆర్ఎన్ఎ): బాన్సువాడ మండలం తాడ్కోల్ మండలంలో విషాదం నెలకొంది. రాజారామ్ దుబ్బ చెరువులో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కాచెల్లెళ్ల మృతదేహాలు బయటపడ్డాయి. సమాచారం అందుకున్న పోలీసులు చెరువు వద్దకు చేరుకుని మృతదేహాలను బయటకు తీశారు. మృతులను అఫీయా(10), మహీన్(9), జోయా(7)గా పోలీసులు గుర్తించారు. అయితే తండ్రి ఫయాజ్.. ఈ ముగ్గురిని హత్య చేసి చెరువులో పడేసి ఉండొచ్చని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఫయాజ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ముగ్గురు చిన్నారుల మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఫయాజ్‌ను విచారిస్తే నిజాలు బయటకు వస్తాయని గ్రామస్థులు తెలిపారు. పోలీసులు కూపీడా దర్యాప్తులో నిజాలు తెలుస్తాయని అన్నారు. అయితే కంటికి రెప్పలా కాపాడాల్సిన కన్న తండ్రే తన ముగ్గురు కుమార్తెలను చెరువులో ముంచి హతమార్చాడని అంటున్నారు. .పోలీసుల కథనం ప్రకారం.. తాడ్కోల్ గ్రామానికి చెందిన ఫయాజ్ చెడు వ్యసనాలకు బానిసై తరచు భార్యతో గొడవపడేవాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం జూదం ఆడేందుకు డబ్బు కావాలని భార్యతో ఘర్షణకు దిగాడు. భార్యపై కక్షతో శుక్రవారం ఉదయం తన కుమార్తెలు అఫియా(10), మాహిన్(9), జోయా(7)లను గ్రామ సమీపంలోని రాజారామ్ దుబ్బ చెరువు దగ్గరకు తీసుకెళ్లి నీటిలో ముంచి హత్య చేశాడు. గ్రామస్థులు గమనించి పోలీసులకు సమాచారం అందజేశారు. డీఎస్పీ దామోదర్‌రెడ్డి ఘటనా స్థలిని పరిశీలించారు. నిందితుడ్ని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

# పైశాచిక టీచర్‌కు గ్రామస్థుల దేహశుద్ది

## –ఆపై పోలీసులకు అప్పగింత

నాగర్‌కర్నూల్,మార్చి6(ఆర్ఎన్ఎ): అమ్మాయిల పట్ల పైశాచికంగా ప్రవర్తిస్తున్న ఉపాధ్యాయుడికి గ్రామస్థులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దూరు గ్రామానికి చెందిన సామ శరత్‌కుమార్ మూడేళ్లుగా వనపర్తి జిల్లాలోని ఓ గ్రామంలో ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. బాలికలు సందేహాలడిగితే ఇంటికి రమ్మనేవాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో వారిపై అసభ్యంగా ప్రవర్తించేవాడు. విషయం ఎవరికీ చెప్పవద్దని భయపెట్టేవాడు. ఒక బాలిక స్నానం చేస్తుండగా రక్తస్రావం కావడం చూసి తల్లి భయపడి ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆమెపై అత్యాచారం జరిగినట్లు వైద్యులు చెప్పడంతో హతాశురాలైన తల్లి ఏం జరిగిందని పాపను అడిగితే విషయం చెప్పింది.

వెంటనే పాఠశాలకు వెళ్లి యజమాన్యాన్ని నిలదీసి ఉపాధ్యాయుడి కోసం గాలింపు చేపట్టారు. కొల్లాపూర్ వెళ్లాడని తెలుసుకుని, అక్కడికి వెళ్లి పట్టుకుని తీసుకువచ్చారు.గ్రామస్థులతా కలిసి ప్రశ్నించగా మద్యం మత్తులో తప్పుచేశానని అంగీకరించాడు. దీంతో అతడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.సీఐ సూర్యానాయక్ గోపాల్‌పేట పోలీస్ స్టేషన్‌లో అతణ్ని విచారించారు. మరి కొందరు బాలికలపై అసభ్యకరంగా ప్రవర్తించానని అతడు అంగీకరించాడు.

# డబ్బు సురక్షితంగానే ఉంది..

## యెస్ డిపాజిటర్లకు సీతారామన్ హామీ

హైదరాబాద్: యెస్ బ్యాంకు డిపాజిటర్లకు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ హామీ ఇచ్చారు. డిపాజిటర్ల డబ్బు సురక్షితంగా ఉన్నట్లు ఆమె చెప్పారు. డిపాజిటర్లు, బ్యాంకు ప్రయోజనాల నేపథ్యంలో ఆర్బీఐ ఓ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె వెల్లడించారు. యెస్ బ్యాంకు సంక్షోభాన్ని త్వరలోనే పరిష్కరించనున్నట్లు ఆర్బీఐ గవర్నర్ తనకు హామీ ఇచ్చినట్లు ఆమె చెప్పారు. ఆర్బీఐతో పాటు ప్రభుత్వం కూడా యెస్ బ్యాంకు కోలుకోవాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. నెలకు కేవలం 50 వేలు మాత్రమే విత్‌డ్రా చేసుకోవాలని యెస్ బ్యాంకు డిపాజిటర్లకు ఆర్బీఐ ఆంక్షలు పెట్టిన విషయం తెలిసిందే.




# వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి హత్య

## మల్కాజిగిరిలో మహిళ హత్య కలకలం

హైదరాబాద్,మార్చి6(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు వ్యక్తులు దారుణ హత్యకు గురయ్యారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మహిళ హత్యకు గురైంది. బాలాజీనగర్, బృందావన్ కాలనీలో అంజలి(23) అనే వివాహితను దారుణంగా హతమార్చారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. అంజలికి రెండేళ్లక్రితం వివాహమైంది. 7 నెలల బాబు ఉన్నాడు. హత్యకు గల కారణం తెలియాల్సి ఉంది. అదేవిధంగా వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల పరిధిలోని సిరిపురం గ్రామ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి హత్యకు గురయ్యాడు. వ్యక్తిని హత్య చేసి మృతదేహాన్ని తగులబెట్టారు.

# కరోనాపై జాగ్రత్తలు తీసుకున్న జిల్లా అధికారులు

## ప్రత్యేక ఐసోలేషన్ వార్డు ఏర్పాటు

## శిక్షణ కోసం హైదరాబాద్‌కు వైద్యుల బృందం

నిర్మల్,మార్చి6(ఆర్ఎన్ఎ): ప్రపంచాన్ని వణికిస్తున్న హమ్మారి కరోనా ఇప్పుడు తెలంగాణలో సైతం కనిపిస్తుండడం రాష్ట్ర ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. దీంతో వైద్యారోగ్య శాఖ జిల్లాలో ముందస్తు చర్యలు చేపట్టింది. నిర్మల్ జిల్లాలో కరోనా వ్యాధి లక్షణాలు కలిగిన వారిని గుర్తించేందుకు జిల్లాకేంద్రంలో ఐసోలేషన్ విభాగం ఏర్పాటు చేశారు. నిర్మల్‌లోని ఏరియా ఆసుపత్రిలో ఐసోలేషన్ విభాగం ఏర్పాటు చేసి అందులో ముగ్గురు వైద్యులు, సిబ్బందితో పాటు ఐదు బెడ్‌లను ఏర్పాటు చేసినట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. జిల్లా నలుమూలల్లో ఎక్కడైనా వ్యాధి లక్షణాలు కలిగిన రోగిని గుర్తిస్తే వెంటనే జిల్లా కేంద్రంలోని ఏరియా ఆసుపత్రిలోని ఐసోలేషన్ విభాగానికి తరలించి ప్రత్యేకమైన చికిత్స అందించడంతో పాటు రోగ తీవ్రతను గుర్తించి అవసరాన్ని బట్టి ఉన్నత వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తామని చెబుతున్నారు. ప్రతీ జిల్లా నుంచి వైద్యుల బృందానికి హైదరాబాద్‌లో ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు నిర్ణయించినట్లు వైద్యారోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. ఇందులో భాగంగా నిర్మల్ జిల్లా నుంచి సైతం వైద్యబృందం హైదరాబాద్‌కు శిక్షణ నిమిత్తం తరలి వెళ్తున్నట్లు పేర్కొంటున్నారు. ఈ బృందంలో 10 మంది వైద్యులు, 10 ల్యాబ్ టెక్నిషియన్‌లు, మరో 10 మంది ఏఎన్ఎంలతో పాటు ఇతర సిబ్బందితో కూడిన ఓ బృందాన్ని హైదరాబాద్ శిక్షణ నిమిత్తం పంప నున్నట్లు అధికారులు చెబుతున్నారు. వీరికి కరోనా వ్యాధి సోకిన రోగికి అందించాల్సిన వైద్యం, వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ ఇవ్వనున్న ట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. దీంతో ప్రపంచ దేశాలను గడ గడలాడించిన కరోనా జిల్లా ప్రజలకు సోకకుండా జిల్లా వైద్యారోగ్య శాఖ ముందస్తు చర్య లు చేపట్టినట్లు తెలుస్తోంది. ప్రజలు కూడా వలు జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు. కరోనా వైరస్‌పై జిల్లా ప్రజలు ఎటువంటి ఆందోళన చెందవద్దని నిర్మల్ డీఎంఅండ్‌హెచ్‌వో వసంత్‌రావు అన్నారు. వ్య క్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే కరోనా లాంటి వైరస్ వ్యాప్తి చెందవు. రాబోయే రోజుల్లో ఎండలు పెరుగనున్నందున కరోనా వైరస్ ప్రమాదం జిల్లాకు ఉండదు. అయినప్పటికీ ముందస్తుగా జాగ్రత్త చర్యలు చేపడుతున్నాం. జిల్లా నుంచి వైద్య బృందానికి ప్రత్యేక శిక్షణ తీసుకునేందుకు హైదరాబాద్‌కు పంపుతున్నట్లు వెల్లడించారు. ఏరియా ఆసుపత్రి లోని ఐ సోలేషన్ వార్డులో కరోనా వ్యా ధిగ్రస్థుల కోసం ప్రత్యేక ఏర్పా ట్లు చేశామన్నారు. కరోనా బారిన పడిన రోగులకు ప్రాథమికంగా వైద్య చికిత్సలు అందించేందుకు ముగ్గురు వైద్యులతో కూడిన బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. . జిల్లా ప్రజలు ఎలాంటి సందేహాలు ఉ న్నా వెంటనే స్థానిక ఆసుపత్రిలో సంప్రదిస్తే నివృత్తి చేస్తారు.ప్రజలు ఆందోళన చెందకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచు కుని వ్యక్తిగత శుభ్రతను పాటిస్తే ప్రమాదకర వ్యాధు లు దరిచేరవని వైద్య నిపుణులు చెబుతున్నారు. కరోనా వ్యాధి లక్షణాలతో రాష్ట్రంలో పలుచోట్ల పలువురు వ్యక్తులు ఆసుపత్రులకు చేరుతున్నారనే వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో ఓ వ్యక్తికి ఈ వ్యాధి లక్షణాలు బయటపడిన నేపథ్యంలో రాష్ట్రంలో ఇప్పుడు కరోనాపై ప్రభుత్వం హై అలర్ట్ ప్రకటించింది. యుద్ధ ప్రాతిపదికన వ్యాధి సోకకుండా ముందస్తుగా ఎ టువంటి జాగ్రత్తలు చేపట్టాలనే విషయాలపై ప్రజలను అప్రమత్తం చేస్తోంది. ఇదే సమయంలో వ్యాధి లక్షణాలు కలిగి ఉన్న రోగికి ఏ విధమైన వైద్యం అందించాలనే దానిపై ప్రతీ జిల్లా నుంచి ఒక ప్రత్యేక వైద్యుల బృందానికి శిక్షణ ఇవ్వనున్నారు. ఇందులో భాగంగానే నిర్మల్ జిల్లాలో సైతం వైద్యారోగ్యశాఖ కరోనా వ్యాధి నివారణ పట్ల అప్రమత్తం అయ్యింది.

# కరోనా భయంతో తగ్గిన చికెన్ అమ్మకాలు

## అమాంతంగా పెరిగిన మాంసం విక్రయాలు

## గొర్రెలు,మేకలకు మేత కోసం కాపరుల ఆందోళన

కరీంనగర్,మార్చి6(నేటినిజం ప్రతినిధి): కరోనా వైరస్ వల్ల కోడి మాంసానికి డిమాండ్ తగ్గింది. చికెన్ వల్ల వ్యాధి వస్తుందన్న దుష్ప్రచారంతో చికెన్ తగ్గించారు. ఇదే సమయంలో మంసానికి డిమాండ్ పెరిగింది. దీంతోగొర్రెలు, మేకల మాంసానికి డిమాండ్ పెరిగింది. కిలోపొట్టేలు మాంసం 600, సాధారణ మాంసం 550 రూపాయలకు విక్రయిస్తున్నారు. ఈ మాంసానికి డిమాండ్‌తోపాటు లాభాలు కూడా ఉండడంతో గొర్రెల కాపరులు గొర్రెలు, మేకల పెంపకంపై దృష్టి సారించారు. ఈ రంగంలోకి చదువుకున్న వాళ్లు కూడా వస్తున్నారు. అయితే గొర్రెలకు సరిపడా మేతలభించక ఇబ్బందులు పడుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో వల్ల జిల్లాలో సాగు విస్తీర్ణం పెరగడంతో గొర్రెలు, మేకలకు మేత కరువయ్యింది. పడావు భూములు లేకపోవడంతో అంతా సాగులోకి తెస్తున్నారు. గడిచిన ఖరీఫ్ సీజన్ నుంచి రెండుపంటలకు పుష్కలంగా నీళ్లు వస్తుండడంతో సాగుకు ఢోకాలే కుండాపోయింది. దీంతో గొర్రెలకాపరులు తమ గొర్రెలకు కాసేందుకు ఖాళీ స్థలాలు దొరకక నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం కూడా రాష్ట్రంలో గొర్రెలు, మేకల మాంసం ఉత్పత్తులను పెంచేందుకు రెండేళ్ల క్రితం 75 శాతం సబ్సిడీపై గొల్ల, కుర్మలకు గొర్రెల యూనిట్లను పంపిణీ చేశారు. ఇందులో సగం మంది లబ్దిదారులు గొర్రెలను విక్రయించుకోవడం గమనార్హం. మరో 10 వేల మంది గొల్ల, కుర్మలకు రెండవ విడతలో గొర్రెలు ఇవ్వాల్సి ఉండగా ప్రభుత్వం వాటి ఊసెత్తడం లేదు.గతంలో ఉన్న గొర్రెలు, మే కలకు తోడు సబ్సిడీ పథకం ద్వారా ఇచ్చిన యూనిట్లతో గొర్రెలు, మేకల ఉత్పత్తి గతంలో కంటే పెరిగింది. మాంసంకు కూడా డిమాండ్ బాగా పెరిగింది. సాధారణంగా గొర్రెలకాపరులు ఉదయమే గొర్రెలను తీసుకుని ఊరు బయటకు వెళుతుంటారు. ఎక్కడ ఖాళీ స్థలాలు, గడ్డి కనబడితే మేతకు అక్కడికి తీసుకెళుతుంటారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట ఆయకట్టుకు రెండుపంటలకు పుష్కలంగా నీళ్లు వస్తుండడంతో ఖాళీ స్థలాలు గొర్రెలకు మేత లభించడం లే దని గొర్రెలకాపరులు చెబుతున్నారు. మేడిగడ్డ నుంచి శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు వరకు గోదావరి కాళేశ్వరం బ్యాక్ వాటర్‌తో నిండి ఉండడంతో మేత కోసం గోదా వరి మీదుగా అవతలి ఒడ్డుకు వెళ్లే పరిస్థితులు లేకుండాపోయాయి. స్థానికంగా ఉండే గొర్రె కాపరులకు ఆరు బయటకు గొర్రెలను మేపడానికే అలవాటుప డ్డారు. కోళ్ల ఫారాల మాదిరిగా గొర్రెలు, మేకల ఫారాలను కూడా ఏర్పాటు చేసుకుని గొర్రెలను పెంచాల్సి ఉంటుంది. మేతలేని కారణంగా డిమాండ్‌కు తగ్గట్లుగా మేత లేకపోవడంతో గొర్రెల కాపరులు గొర్రెలను పెంచే పరిస్థితి లేకుండాపోయింది. స్థానికంగా కావా ల్సిన ఉత్పత్తి లేకుంటే మాంసం ధరలు అమాంతం పెరిగిపోయి ప్రజలకు ఆర్థిక భారం కానున్నది. ఇప్ప టికే గొర్రెలకాపరుల సంఘాలు, ఆయాసంఘాల ప్రతి నిధులు గొర్రెలకు మేత కోసం ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలని, ఫారం తరహా పెంపకానికి ప్రోత్సాహ కాలు అందించాలని కోరడంతో జిల్లా పశు సంవర్ధక శాఖాధికారులు స్పందించారు. ఫామ్ తరహాలో గొర్రెలను పెంచుతున్న తీరును పరిశీలించారు. ఈ విధానంవల్ల గొర్రెలకు మేత పుష్కలంగా దొరకడంతో పాటు తక్కువ రోజుల్లోనే గొర్రెల్లో ఎదుగుదల ఉండి లాభాలు వస్తున్నాయి. మేతకు ప్రత్యామ్నాయంగా ఫామ్ తరహాలో గొర్రెల పెంపకంపై గొర్రెలకాపరులను ప్రోత్సహిస్తే మంచి ఫలితాలు వస్తాయంటున్నారు. ముందు చూపుతో ప్రభుత్వం గొర్రెలకు ప్రత్యామ్నాయం గా ఫామ్ తరహాలో గొర్రెల పెంపకానికి షెడ్డు నిర్మాణానికి సబ్సిడీ రుణాలు ఇప్పించాలని, గడ్డి విత్తనాలను సబ్సిడీపై అందజేయాలని గొర్రెలకాపరులు కోరుతున్నారు.

# మెట్రో,ఆర్టీసీలపై కరోనా ప్రభావం

## భారీగా తగ్గిన ప్రయాణికుల సంఖ్య

## మాస్కులు పంపిణీ చేసిన కాంగ్రెస్ నేత

హైదరాబాద్,మార్చి6(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్‌పై ఆందోళన కారణంగా ప్రజా రవాణపై తీవ్ర ప్రభావం పడింది. మెట్రో, ఆర్టీసీల్లో ప్రయాణాలు తగ్గించారు. దీంతో ఈ రెండు సంస్థల రాబడిపై ప్రభావం చూపుతోంది. కరోనా వ్యాప్తి చెందిందన్న ఆందోళన నెలకొన్న నేపథ్యంలో మెట్రో ప్రయాణికుల సంఖ్య తగ్గిందని ఆ సంస్థ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. గురువారం మీడియాతో మాట్లాడిన ఆయన.. కరోనా భయంతో 10వేల మంది ప్రయాణికులు తగ్గారని తెలిపారు. కరోనా భయంకరమైనది కాదని.. ముందు జాగ్రత్త చర్యగా మెట్రో రైల్ కోచ్‌లను శుభ్రం చేస్తున్నామన్నారు. సర్వీసులు ముగిసిన తర్వాత ఆటో కెమికల్స్‌తో శుభ్రపరుస్తున్నామన్నారు. ప్రయాణీకులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అయితే జంట నగరాల్లో వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తగ్గారు. దీంతో మెట్రోలో ఇతర ప్రాంతాలకు వెళ్లడం లేదు. ఇదిలావుంటే ఆర్టీసీకి కరోనా ఎఫెక్ట్ తగిలింది. జనాలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణాలు తగ్గించారు. రెండు రోజుల నుంచి ఆర్టీసీ ఆదాయం తగ్గింది. అత్యవసరం అయితే తప్ప ప్రజలు ప్రయాణాలు చేయడంలేదు. రద్దీ ఎక్కువగా ఉండే బస్సుల్లో ప్రయాణం చేయడంలేదు. దీంతో ఆర్టీసీ కరోనా కట్టడికి చర్యలు తీసుకుంటుంది. అధికారులు ఆర్టీసీ బస్సులను శానిటైజర్లతో శుభ్రం చేయిస్తున్నారు. మరోవైపు నగరవాసులని వణికిస్తున్న కరోనా వైరస్పై అవగాహన కార్యక్రమాలు ఊపందుకున్నాయి. ప్రతి పౌరుడూ తాను జాగ్రత్తపడుతూ.. ఇతరులకు అవగాహన కలిగించడం ముఖ్యమని డాక్టర్లు చెబుతున్నారు. ఎల్బీ నగర్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పన్యాల జైపాల్ రెడ్డి సరిగ్గా ఇదే చేస్తున్నారు. మెట్రో ప్రయాణికులకు ఉచితంగా మాస్కులు పంపిణీ చేస్తూ తనవంతు సామాజిక బాధ్యతను నిర్వహిస్తున్నారు. ఎల్బీ నగర్ నుంచి వివిధ ప్రాంతాలకు మెట్రోలో వెళుతున్న సుమారు 1500 మందికి గురువారం ఉదయం మాస్కులు పంపిణీ చేశారు. షేక్ హ్యాండ్ వద్దని.. నమస్కారం ముద్దని ప్రయాణికులకు తెలియజేశారు. రెండు రూపాయలకు దొరికే మాస్కును 50 రూపాయలకు అమ్మడంపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. జీహెచ్ఎంసీ పరిధిలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు.

కొంపల్లిలో కరోనా కలకలం

కొంపల్లి హోటల్‌లో కరోనా వైరస్ అలజడి రేగింది. ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్ హైదరాబాద్ నగర శివారులోని కొంపల్లి మున్సిపాలిటీలో అలజడి రేపింది. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని కొంపల్లికి చెందిన 32 ఏళ్ల మహిళ ఫిబ్రవరి 28వ తేదీన ఇటలీ దేశం నుంచి నగరానికి వచ్చి.. కొంపల్లి జాతీయ రహదారి సినీ ప్లానెట్ పక్కన ఉన్న హోటల్లో ఆమె బసచేసింది. అనంతరం ఆమె మరొక హోటల్‌కు వెళ్ళటం ఆ తరువాత కరోనా వైరస్ లక్షణాలతో బాధ పడటంతో గాంధీ ఆస్పత్రిలో చేర్చారు. ఈ మేరకు రంగంలోకి దిగిన వైద్య శాఖ అధికారులు పూర్తి దర్యాప్తు చేస్తున్నారు. బుధవారం కొంపల్లికి చేరుకున్న వైద్యశాఖ అధికారులు ఆ మహిళ బసచేసిన హోటల్లో తనిఖీలు చేశారు. హోటల్ సిబ్బంది అధికారులకు సహకరించక పోవటంతో పరిస్థితి జటిలంగా మారింది. సమాచారం అందుకున్న పేట్ బషీరాబాద్ పోలీసులు కొంపల్లి మున్సిపల్ కమిషనర్ ఎంఎన్ఆర్ జ్యోతితో కలిసి హోటల్‌కు చేరుకొని వైద్యశాఖ అధికారులకు సహకరించాలని హోటల్ సిబ్బందిని కోరారు. హోటల్ చుట్టు పక్కల ఉన్న వారికి జలుబు జ్వరం లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించినట్లు అధికారులు తెలిపారు.

మహిళా కండక్టర్‌కు కరోనా అంటూ ప్రచారం

పశ్చిమగోదావరి జిల్లా సత్తుపల్లిలో ఆర్టీసీ డిపోకు చెందిన మహిళా కండక్టర్‌కు కరోనా అంటూ ప్రచారం జరగడం తీవ్ర కలకలం రేపుతోంది. మహిళా కండక్టర్ గత నాలుగు రోజులుగా దగ్గు, జ్వరంతో బాధపడుతోంది. ఈ క్రమంలో డ్యూటీపై సత్తుపల్లి నుంచి ఏలూరు వస్తుండగా ఆమె అస్వస్థతకు గురయ్యారు. దీంతో వెంటనే కండక్టర్‌ను చింతలపూడి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు సాధారణ జ్వరంగా నిర్ధారించారు. అయినప్పటికీ ముందు జాగ్రత్తగా మహిళా కండక్టర్‌ను వైద్యులు పరిశీలనలో ఉంచారు.

# లైసెన్స్ పొందిన 10 నిమిషాలకే నదిలో పడ్డ కారు

## ఫోన్ ఛాటింగ్ చేస్తుండగా ప్రమాదం

బీజింగ్,మార్చి6(ఆర్ఎన్ఎ): డ్రైవింగ్ టెస్ట్ పాసైన ఆనందంలోంచి బయటకు రాకముందే ఓ వ్యక్తి ప్రమాదం బారిన పడ్డాడు. ఈ ఘటన చైనాలో చోటుచేసుకుంది. జాంగ్ అనే వ్యక్తి డ్రైవింగ్ టెస్ట్‌కు హాజరయ్యాడు. డ్రైవింగ్ టెస్ట్ పాసై లైసెన్స్ తీసుకుని తిరుగు ప్రయాణమయ్యాడు. ఓ బ్రిడ్జి మీదుగా వెళ్తూ

ఒక్కసారిగా అదుపుతప్పి నేరుగా నదిలోకే కారును పోనిచ్చాడు. ఇదంతా అక్కడి సీసీ కెమెరాలో రికార్డు అయింది. లైసెన్స్ పొందినందుకు వస్తున్న అభినందనల టెక్స్ట్ మేసేజ్‌లకు అతడు ఫోన్‌లో తిరిగి స్పందిస్తుండగా ప్రమాదం భారిన పడ్డాడు. జున్యి ట్రాఫిక్ పోలీసులు ఈ యాక్సిడెంట్ ఫోటోలను సోషల్ మీడియాలో పోస్టు చేస్తూ కారు యజమాని 10 నిమిషాల క్రితమే లైసెన్స్ పొందినట్లుగా పేర్కొన్నారు. కారులో వెళ్తూ ఫోన్‌లో మేసేజ్‌లను చూస్తున్నాను. బ్రిడ్జిపై ఇద్దరు వ్యక్తులు కారుకు ముందుగా వచ్చారు. దీంతో భయాందోళనకు గురై ఒక్కసారిగా ఎడమవైపు తిప్పడంతో నదిలో పడ్డా. కారు డోర్‌ను తన్ని తప్పించుకున్నట్లు సదరు కారు యజమాని పేర్కొన్నాడు. క్రేన్ సహాయంతో నదిలోని కారును బయటకు తీశారు.



# ఎమ్మెల్యే సోదరి కారు ప్రమాదంలో కొత్త ట్విస్ట్

## డైరీని స్వాధీనం చేసుకున్న పోలీసులు

కరీంనగర్,మార్చి6(ఆర్ఎన్ఎ): అలుగునూరు కాకతీయ కెనాల్ కారు ప్రమాదంలో కొత్త ట్విస్ట్ చోటు చేసుకుంది. సత్యనారాయణ రెడ్డి ఫెర్టిలైజర్ షాపులో డైరీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డైరీ ఆధారంగా పోలీసులు కొన్ని కీలక అంశాలు సేకరించారు. తన ఆస్తిని టీటీడీకి రాసివ్వాలంటూ సత్యనారాయణ డైరీలో రాశారు. ఈ కారు ప్రమాదంలో ముందు నుంచి అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ప్రమాదం వెలుగులోకి వచ్చిన తర్వాత పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అనేక కొత్త కొత్త ఆధారాలు బయటకు వస్తున్నాయి. సత్యనారాయణ తన ఆస్తులను డైరీలో రాసుకున్నారంటే.. కారులో ప్రయాణిస్తూ ఆయన కాలువలోకి దూసుకువెళ్లారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డైరీని పోలీసులు పూర్తిగా చదివిన తర్వాత మరిన్ని విషయాలు తెలిసే అవకాశం ఉంది. ఆస్తని టిటిడికి రాసివ్వమంటే కుటుంబంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

# వ్యభిచార ఘటనలో కానిస్టేబుల్ అరెస్ట్

హైదరాబాద్,మార్చి6(ఆర్ఎన్ఎ): వ్యభిచారం కేసులో కానిస్టేబుల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన బంజారాహిల్స్‌లో చోటుచేసుకుంది. బంజారాహిల్స్‌లోని కృష్ణానగర్‌లో గుట్టు చప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు ముగ్గురు వ్యక్తులతో పాటు లంగర్‌హౌస్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న రఘును కూడా అదుపులోకి తీసుకున్నారు. వీరిపై పిటా కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు స్పష్టం చేశారు.

# జాతీయ రహదారులను పట్టించుకోండి

## –రాజ్యసభలో ఎంపి బడుగుల లింగయ్య యాదవ్

న్యూఢిల్లీ,మార్చి6(ఆర్ఎన్ఎ): తెలంగాణలోని అన్ని జాతీయ రహదారులపై అండర్ పాస్ బ్రిడ్జిలు, సర్వీస్ రోడ్లను నిర్మించాలని టీఆర్ఎస్ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ కేంద్రాన్ని కోరారు. రాజ్యసభ జీరో అవర్ లో మాట్లాడిన ఆయన జాతీయ రహదారులు, డ్రైనేజీలపై అండర్ పాస్ బ్రిడ్జిలు, సర్వీస్ రోడ్లను నిర్మాణం చేయాలన్నారు. హైద్రాబాద్–విజయవాడ జాతీయ రహదారి నెం. 65పై.. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని చౌటుప్పల్, గుండ్రాం పల్లి, చిట్యాల, సూర్యపేట, దూరాజుపల్లి వద్ద అండర్ పాస్ బ్రిడ్జిలు, సర్వీస్ రోడ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని లింగయ్య యాదవ్ కేంద్రానికి తెలిపారు. అండర్ పాస్ బ్రిడ్జీలు, సర్వీస్ రోడ్లు లేక నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు.

# టెస్కాబ్ ఛైర్మన్‌గా కొండూరి రవీంద్రరావు

## వైస్ ఛైర్మన్‌గా గొంగడి మహేందర్ రెడ్డి

## ఏకగ్రీవంగా ఎన్నికైన ఇరు నేతలు

## రైతు సమన్వయ సమితుల పేర్లను రైతుబంధు సమితులుగా మారుస్తాం

## కెసిఆర్ వ్యవసారంగంలో విప్లవం తెచ్చారన్న మంత్రి నిరంజన్ రెడ్డి

హైదరాబాద్,మార్చి6(ఆర్ఎన్ఎ): రైతును రాజును చేసేలా వ్యవసాయ రంగంలో సీఎం కేసీఆర్ సంస్కరణలు తీసుకొచ్చారని మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. అందుకు రైతుబంధు, రైతుభీమా పథకాలే నిదర్శనమన్నారు. త్వరలోనే రైతు సమన్వయ సమితిల పేరును కూడా రైతు బంధు సమితులుగా మార్చనున్నట్లు తెలిపారు. దేశంలో ఏ ప్రభుత్వం ప్రవేశపెట్టని విధంగా రైతుల అభివృద్ధి కోసం వ్యవసాయం, కరెంట్, ప్రాజెక్టుల కోసం ఏడాదికి రూ. 60 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. యూపీ లాంటి రాష్ట్రాల్లోనూ మన బ్జడెట్‌లో మూడో వంతు కూడా ఖర్చుపెట్టడం లేదన్నారు. హైదరాబాద్ అబిడ్స్‌లోని టెస్కాబ్ కార్యాలయంలోటెస్కాబ్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక జరిగింది. టెస్కాబ్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులకు ఒక్కో నామినేషన్ దాఖలు కావడంతో ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగాయి. టెస్కాబ్ ఛైర్మన్‌గా కొండూరి రవీంద్రరావు, వైస్ ఛైర్మన్‌గా గొంగడి మహేందర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జరిగిన కార్యవర్గ సమావేశానికి మంత్రి నిరంజన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ సహకార సంఘం ఎన్నికల్లో ఏకపక్షంగా మద్దతు తెలిపిన రైతాంగానికి ధన్యవాదాలు తెలిపారు. టెస్కాబ్ ఛైర్మన్‌గా రవీందర్‌రావు, వైస్ ఛైర్మన్‌గా గొంగడి మహేందర్ రెడ్డి ఎన్నికకు సహకరించిన డైరెక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ముఖచిత్రమే వ్యవసాయమని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి రైతాంగానికి సంబంధించి సీఎం కేసీఆర్ అసాధారణ నిర్ణయాలు తీసుకుంటూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. టెస్కాబ్ కొత్త పాలకవర్గం సీఎం కేసీఆర్ స్ఫూర్తిని నిలబెట్టేలా పనిచేయాలని చెప్పారు.

# బ్యాంకుల విలీనం ప్రతిపాదనలపై యూనియన్ల గుస్సా

## 27న సమ్మెకు పిలుపునిచ్చిన ప్రధాన సంఘాలు

న్యూఢిల్లీ,మార్చి6(ఆర్ఎన్ఎ): పది ప్రభుత్వ బ్యాంకుల విలీనానికి కేంద్రం కేబినెట్ ఆమోదం తెలపడానికి వ్యతిరేకంగా బ్యాంకు యూనియన్లు సమ్మెకు పిలుపునిచ్చాయి. ఈ నెల 27న సమ్మె నిర్వహించాలని రెండు ప్రధాన బ్యాంకు యూనియన్లు అయిన అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం(ఏఐబీఈఏ), అఖిల భారత బ్యాంకు అధికారుల సంఘం(ఏఐబీఓఏ) నిర్ణయించాయి. ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీనం ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వస్తుందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మరోసారి స్పష్టం చేశారు.

పది ప్రభుత్వ రంగ బ్యాంకులను నాలుగు బ్యాంకులుగా కుదించాలని కేంద్రం గతేడాది ప్రతిపాదించింది. ఈ మేరకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. విలీన విషయమై బ్యాంకులతో ఎప్పటికప్పుడు కేంద్రం మంతనాలు జరుపుతోందని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి బ్యాంకుల బోర్డులు అన్ని రకాల నిర్ణయాలు తీసుకున్నాయన్నారు. ఈ మెగా విలీనానికి నియంత్రణ పరంగా ఎలాంటి సమస్యలు లేవని సీతారామన్ స్పష్టం చేశారు. ఈ ప్రకటన నేపథ్యంలో బ్యాంకు యూనియన్లు సమ్మెకు పిలుపునిచ్చాయి.

# శ్రీవారి ఆర్జితసేవ టికెట్లు విడుదల

తిరుమల,మార్చి6(ఆర్ఎన్ఎ): జూన్ నెలకు సంబంధించి తిరుమల శ్రీవారి ఆర్జితసేవ ఆన్‌లైన్ టికెట్లు టీటీడీ విడుదల చేసింది. జూన్ నెల కోటా కింద మొత్తం 60,666 శ్రీవారి ఆర్జిత సేవ టికెట్లు విడుదల చేసినట్లు టీటీడీ అధికారులు తెలిపారు. ఇందులో సుప్రభాతం 7,681, తోమాల 130, అర్చన 130, అష్టదళపాదపద్మారాధన 300, నిజపాద దర్శనం 1,725 టికెట్లు విడుదలయ్యాయి. ఆన్‌లైన్ జనరల్ కేటగిరీలో 50,700 టికెట్లు విడుదల చేశారు. ఇందులో విశేష పూజ 1500, కల్యాణం 13,300, ఊంజల్ సేవ 4,200, ఆర్జిత బ్రహ్మోత్సవం 7,700, వసంతోత్సవం 6,600, సహస్రదీపాలంకార సేవ 17,400 టికెట్లు ఉన్నాయి. కాగా ఆన్‌లైన్ డిప్ విధానంలో 9,966 టికెట్లు విడుదల చేశారు. ఇదిలావుంటే తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. శ్రీ వేంకటేశ్వరస్వామివారి సాధారణ సర్వదర్శనానికి భక్తులు 16 కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్నారు. సాధారణ సర్వదర్శనానికి 8 గంటల సమయం, టైమ్‌స్లాట్ టోకెన్లు పొందిన భక్తులకు 3 గంటల సమయం పడుతుంది. స్వామివారిని గురువారం 60,485 మంది భక్తులు దర్శించుకున్నారు. శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.5 కోట్లుగా గుర్తించారు.

# 31కి చేరిన కరోనా బాధితుల సంఖ్య

న్యూఢిల్లీ,మార్చి6(ఆర్ఎన్ఎ): దేశంలో నావెల్ కరోనా వైరస్ సోకిన వారి సంఖ్య 31కి చేరుకున్నది. కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి సంజీవ్ కుమార్ ఈ విషయాన్ని వెల్లడించారు. ఢిల్లీలోని ఉత్తమ్ నగర్‌కు చెందిన ఓ వ్యక్తికి కరోనా సోకినట్లు నిర్ధారించారు. థాయిలాండ్, మలేషియా నుంచి అతను వచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగా ఉన్నది. అతన్ని అబ్జర్వేషన్‌లో పెట్టారు. వైరస్ విజృంభిస్తున్న నేపథ్యంలో.. సామూహిక వేడుకలను రద్దు చేసుకోవాలని కేంద్ర ఆరోగ్య శాఖ ప్రజలను కోరింది. కోవిడ్19 వ్యాపిస్తున్న నేపథ్యంలో ఆయా రాష్ట్రాలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

## కర్నాటకలో ఘోర రోడ్డు ప్రమాదం

# రెండు కార్లు ఢీకొని 13 మంది మృత్యువాత



కర్నాటక తుంకూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పరస్రం ఢీకొనడంతో ధ్వంసమైన క

బెంగుళూరు,మార్చి6(ఆర్ఎన్ఎ): కర్నాటకలో శుక్రవారం తెల్లవారుజామున ఘోరరోడ్డుప్రమాదం జరిగింది. బెంగళూరు–మంగళూరు జాతీయ రహదారిపై చోటుచేసుకున్న ఈ ప్రమాదంలో 13 మంది మృతి చెందగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్సనిమిత్తం సమీప ఆస్పత్రులకు తరలించారు. తుమ్కూరు జిల్లా బాలదాకరేలో రెండు కార్లు ఢీకొనడం వల్ల కార్లలో ఉన్న పదమూడు మంది అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు. స్థానికులు సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మృతులలో 10 మంది తమిళనాడుకు చెందినవారు కాగా, మరో ముగ్గురు బెంగళూరుకు చెందినవారని పోలీసులు తెలిపారు. కర్నాటకలోని ధర్మస్థలంలో ఉన్న ఆలయదర్శనం చేసుకుని వస్తున్న సందర్భంగా ఈ ప్రమాదం జరిగింది. చనిపోయినవారిలో 6గురు మహిళలు, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. అతివేగం వల్లే ఈ ఘోర ప్రమాదం జరిగిందని పోలీసులు వెల్లడించారు.

## స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా సురేశ్ రెడ్డి?

### సిఎం కెసిఆర్ సానుకూలంగా ఉన్నారంటూ ప్రచారం

నిజామాబాద్,మార్చి6(ఆర్ఎన్ఎ): నిజామాబాద్ స్థానిక సంస్థల నుంచి జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలో మాజీ స్పీకర్ సురేశ్ రెడ్డికి అవకావం దక్కనుందని ప్రచారం జరగుతోంది. ఆయనకు గతంలో పదవి కల్పిస్తామని సిఎం కెసిఆర్ ఇచ్చిన హామీ మేరకు ఈ అవకావం రానుందని అంటున్నారు. అయితే ఈ ఎమ్మెల్సీ పదవి కాలం మరో రెండు సంవత్సరాలు మాత్రమే మిగిలి వుంది. గురువారం వెల్లడించిన షెడ్యూల్ ప్రకారం మార్చి 12న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి, ఏప్రిల్ ఏడో తేదీన ఓటింగ్ నిర్వహిస్తారు. ఈ ఎమ్మెల్సీ కోసం టిఆర్ఎస్ పార్టీలో పెద్ద ఎత్తున ఆశావహులు ఉన్నారు. కానీ మాజీ స్పీకర్ సురేశ్ రెడ్డి అభ్యర్థిత్వంపై కేసీఆర్ సానుకూలంగా వున్నట్లు ప్రచారం జరుగుతోంది. తెలంగాణ రాష్ట్రంలో అన్ని ఎన్నికలు ముగిసాయనుకుంటున్న వేళ స్థానిక సంస్థల నుంచి ఎమ్మెల్సీ ఎన్నిక జరుగబోతున్నది. ఇక మూడున్నరేళ్ళ దాకా ఏ ఎన్నికలు లేవని అందరూ అనుకుంటుంటే మరోమారు ఎన్నికలు వచ్చిపడ్డాయి. ఈ మేరకు కేంద్ర ఎన్నికల కమిషన్ గురువారం సాయంత్రం షెడ్యూలు జారీ చేసింది. ఈ ఎన్నికలకు మార్చి 12వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేసి.. ఏప్రిల్ 7వ తేదీన ఎన్నికలు నిర్వహిస్తామని కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రకటించింది. పార్టీ ఫిరాయింపుల చట్టం క్రింద ఎమ్మెల్సీ భూపతి రెడ్డిపై వేటు పడడంతో ఖాళీ అయిన స్థానిక సంస్థల కోటాలోని నిజామాబాద్ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. కేంద్ర ఎన్నికల కమిషన్. టిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి భూపతిరెడ్డి ఫిరాయించడంతో ఆయనపై గులాబీ పార్టీ శాసనమండలి ఛైర్మెన్‌కు ఫిర్యాదు చేసింది. దాంతో కౌన్సిల్ ఛైర్మెన్ భూపతిరెడ్డిపై అనర్హత వేటు వేశారు. కానీ తనపై అనర్హత వేటు చెల్లదంటూ భూపతి రెడ్డి కోర్టును ఆశ్రయించారు. కోర్టు కూడా శాసన మండలి ఛైర్మన్ తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించడంతో ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమమైంది. ఈ మేరకు సీఈసీ షెడ్యూల్ ప్రకటించింది.

# వినూత్న రంగాల్లో పెట్టుబడులకు అవకాశాలు



హైదరాబాద్ , మార్చి 6: తెలంగాణలో అద్భుతమైన మానవ వనరులు, టెక్నాలజీ నేపథ్యంలో డిజిటల్ డ్రగ్ డిస్కవరీ వంటి వినూత్న రంగాల్లో పెట్టుబడులకు అనేక అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కే తారక రామారావు అన్నారు. ప్రగతి భవన్‌లో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కే తారక రామారావుతో ప్రముఖ అంతర్జాతీయ ఫార్మా కంపెనీ సనోఫి అంతర్జాతీయ భాగస్వామ్యాల అధిపతి ఫ్యాబ్రైస్ జీయోఫ్ఫే భేటి అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సంస్థ కార్యకలాపాలను, భవిష్యత్ ప్రణాళికల గురించి కేటీఆర్‌కు వారికి వివరించారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పారిశ్రామిక విధానాలపై వారు అసక్తి కనపరిచారు. హైదరాబాద్ నగరం అంతర్జాతీయ వ్యాక్సిన్ క్యాపిటల్‌గా రూపాంతరం చెందిందని, ఇక్కడ వ్యాక్సిన్ తయారీకి సంబంధిత రంగాల్లో అభివృద్ధికి అనేక అవకాశాలు ఉన్నాయని కేటీఆర్ వారికి తెలిపారు. తెలంగాణలో ఉన్న ఫార్మా, లైఫ్ సైన్సెస్ ఎకో సిస్టం, దాన్ని మరింత బలపరిచేందుకు తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న కార్యకలాపాలను కేటీఆర్ వివరించారు.

ఇక్కడ మానవ వనరులు, అందుబాటులో ఉన్న టెక్నాలజీ, అద్భుతమైన మానవ వనరుల నేపథ్యంలో డిజిటల్ డ్రగ్ డిస్కవరీ వంటి వినూత్న రంగాల్లో అనేక పెట్టుబడులకు అవకాశాలు ఉన్నాయని తెలిపారు. 2020 సంవత్సరాన్ని తెలంగాణ ప్రభుత్వం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సంవత్సరంగా ప్రకటించి వివిధ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఇప్పటి అనేక ఫార్మా దిగ్గజ కంపెనీలు తమతో కలిసి ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ రంగంలో భాగస్వాములు అయ్యేందుకు సుముఖత వ్యక్తం చేశాయని ఆయన తెలిపారు. తెలంగాణ ప్రభుత్వంతో సనోఫి సంస్థ కూడా కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో సనోఫి కార్యకలాపాల కోసం కావాల్సిన ఎలాంటి సహాయ సహకారాలు అందించేందుకైన తెలంగాణ ప్రభుత్వం ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందని మంత్రి కేటీఆర్ వారికి తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఆర్ అండ్ బీ శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, సనోఫి కంపెనీ సౌత్ ఏషియా, జనరల్ మేనేజర్ అన్నపూర్ణదాస్, శాంతా బయోటెక్ ఛైర్మన్ కే ఐ వరప్రసాద్ రెడ్డిలు సమావేశంలో పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్‌లో కరోనా కు సంబంధించి ఆస్పత్రిలో ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి శ్రీనివాసగౌడ్

# కరోనా వార్డును సందర్శించిన మంత్రి

### ప్రజలు భయాందోళనలకు గురి కావద్దని సూచన

మహబూబ్ నగర్,మార్చి6(ఆర్ఎన్ఎ): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటు చేసిన కరోన ప్రత్యేక వార్డ్ ను మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్, జిల్లా కలెక్టర్ వెంకట్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కరోనా వైరస్ పట్ల ప్రజలు భయభ్రాంతులకు గురికావద్దన్నారు. దీనిపై ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని తెలిపారు. సీఎం కేసీఆర్, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్, వైద్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తున్నారన్నారు. ప్రజలందరు కనీస జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మహబూబ్ నగర్ జిల్లా ఆసుపత్రిలో చికిత్స కోసం ప్రత్యేక వార్డ్ ను ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేశాం. పుకార్లను నమ్మొద్దు. ఎవరైనా పుకార్లు పుట్టిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఎవరైనా దేశీయ, విదేశీ పర్యాటకులు రాష్ట్రానికి వస్తే వారిని క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించి అనుమతి ఇవ్వాలని మంత్రి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మహబూబ్ నగర్ జిల్లాలో ప్రభుత్వ, ప్రవేట్ ఆసుపత్రులకు చెందిన డాక్టర్లు అప్రమత్తంగా ఉన్నారని పేర్కొన్నారు.


**IN THE COURT OF THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL-CUM-XXVII ADDL CHIEF JUDGE: C.C.C. AT SECUNDERABAD**
**O.P.NO.654 OF 2019**

Between:
**Smt. Aella Sujatha &others** .....Petitioner
**And**
**Mr. Bhupathi Venkateshwarlu & Others** ..... Respondents

To
R-1, Mr. Bhupathi Venkateshwarlu.
S/o. Seetharamaiah @ Seetharamulu,
Aged About: Major, Occ: Lorry Driver,
(Driver of Crime Vehicle)
R/o.H.No. 2-76, Payapur,
Kalluru Mandal,
Khammam Dist,T.S-507 209.

NOTICE

Please take notice that in the above matter the Petitioner had filed a case against you (Respondent No.1) for compensation of **Rs.70,00,000/-** and the same is posted for your appearance on **15-04-2020.**

You are advised to appear on **15-04-2020** at 10.30 a.m. before the said court either in person or through an Advocate failing which, the case will be decided exparte.

(BY THE ORDER OF THE COURT)
**M/s. EMMADI SRINIVAS REDDY**
**BANDI KALAVATHI**
**GODUGU KRISHNA**
Advocates.
#H.No.12-11-1556/AB,
Flat No.001, Harika Enclave
Boudha Nagar, Warasiguda,
Secunderabad-61
Cell: 9676301324
7675975689.


## ముందు శబరిమల వివాదంపై విచారణ

### ఆ తరువాతే సీఏఏ వ్యతిరేక పిటిషన్లపై విచారణ: సుప్రీం

న్యూఢిల్లీ,మార్చి6(ఆర్ఎన్ఎ): సీఏఏ వ్యతిరేక పిటిషన్లపై సుప్రీం కోర్టులో విచారణ ఎప్పుడు జరుగుతుందో ఇప్పటికి ఓ స్పష్టత వచ్చింది. సిఏఏకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టులో వందల సంఖ్యలో పిటిషన్లు దాఖలైన విషయం విషయం తెలిసిందే. అయితే శబరిమలలో స్త్రీల ప్రవేశంపై రివ్యూ పిటిషన్ విచారణ పూర్తయిన తర్వాతే సీఏఏ వ్యతిరేక పిటిషన్లపై విచారణ చేపడతామని సుప్రీం కోర్టు తెలిపింది. సుప్రీం కోర్టులో గురువారం సీఏఏ చట్టంపై రాజ్యాంగ వివరణని మరో రెండు రోజుల్లో సమర్పిస్తామని కేంద్ర ప్రభుత్వం తరపున న్యాయవాది కెకె వేణుగోపాల్ చెప్పారు. ప్రధాన న్యాయమూర్తి ఎస్ఏ బోబ్డే అధ్యక్షతన ఏర్పడిన సుప్రీం ధర్మాసనం ఈ పిటిషన్లను విచారణ చేస్తోంది. సీఏఏ చట్టానికి వ్యతిరేకంగా దేశమంతటా నిరసనలు జరుగుతున్న కారణంగా ఈ పిటిషన్లపై వెంటనే విచారణ మొదలు పెట్టాలని పిటిషన్ల తరపు న్యాయవాది కపిల్ సిబల్ ప్రధాన న్యాయమూర్తిని కోరారు. కానీ శబరిమల విచారణ పూర్తి కాగానే సీఏఏ వ్యతిరేక పిటీషన్ల విచారణ మొదలవుతుందని ప్రధాన న్యాయమూర్తి ఎస్ఏ బోబ్డే అన్నారు.

## కరెంట్ షాక్‌తో యువరైతు మృతి

మెదక్,మార్చి6(ఆర్ఎన్ఎ): జిల్లాలోని నార్సింగి మండలం జప్తి శివనూర్ గ్రామ సమీపంలో విషాద సంఘటన చోటు చేసుకుంది. రైతు మల్లయ్య మూడవ కుమారుడు సురారం సుధాకర్(26) ట్రాన్స్‌ఫార్మర్ ఫీజు వేస్తుండగా కరెంటు సరఫరా కావడంతో షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. కరెంటు బంద్ చేయాలని ఎల్‌సీ తీసుకున్నా కాని విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో రైతు షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోయాడని ఇతర రైతులు ఆరోపించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, విద్యుత్ అధికారులు మృతుడి కుటుంబానికి ప్రభుత్వం తరపున సహాయం చేస్తామని హామీ ఇచ్చారు.

## ఏప్రిల్1 నుండి విలీనం కానున్న బ్యాంకులు

### వివరాలను ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ,మార్చి6(ఆర్ఎన్ఎ): పది ప్రభుత్వ రంగ బ్యాంకులను నాలుగు బ్యాంకులుగా కుదించే విలీన పక్రియ ఏప్రిల్ 1 నుండి అమలులోకి రాబోతుంది. దీనికి సంబంధించిన పక్రియ ప్రస్తుతం వేగవంతం చేశామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. బ్యాంకుల విలీన విషయమై బ్యాంకులతో ఎప్పటికప్పుడు కేంద్రం చర్చలు జరుపుతూ ఉంది.కెనరా బ్యాంకు సిండికేట్ బ్యాంకులో విలీనం, ఓరియెంటెల్ బ్యాంకు అఫ్ కామర్స్, యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలను పంజాబ్ నేషనల్ బ్యాంకులో విలీనం అవుతున్నాయి. అలాగే ఆంధ్రాబ్యాంకు, కార్పొరేషన్ బ్యాంకు యూనియన్ బ్యాంకులో, ఇండియన్ బ్యాంకులో అలహాబాద్ బ్యాక్ విలీనం అవుతున్నాయి.దేశంలో ప్రపంచ స్థాయి బ్యాంకులను తయారీ చేసేందుకు అలాగే సంక్షోభంలో చిక్కుకున్న బ్యాంకింగ్ వ్యవస్థను గ్టటెక్కించేందుకు కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. ఇక కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల దేశంలో 12 ప్రభుత్వరంగ బ్యాంకులు మాత్రమే ఉండనున్నాయి.

## రేవంత్‌రెడ్డికి 14రోజుల రిమాండ్

హైదరాబాద్,మార్చి6(ఆర్ఎన్ఎ): కాంగ్రెస్ ఎంపీ రేవంత్‌రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశాక రాజేంద్రనగర్‌లోని జడ్జి నివాసంలో పోలీసులు హాజరుపర్చారు. రేవంత్‌కు 14 రోజుల రిమాండ్ విధించారు. రేవంత్‌రెడ్డిని పోలీసులు చర్లపల్లి జైలుకు తరలించారు. కేటీఆర్ ఫామ్‌హౌస్‌ను డ్రోన్‌తో చిత్రీకరించారని రేవంత్‌పై అభియోగం ఉందని పోలీసులు చెబుతునారు. అంతకు ముందు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో రేవంత్‌రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఢిల్లీ నుంచి వస్తుండగా రేవంత్‌రెడ్డిని ఎన్‌వోటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేటీఆర్ ఫామ్‌హౌస్‌ను డ్రోన్‌తో చిత్రీకరించారని రేవంత్‌పై అభియోగం, ఇప్పటికే నలుగురు రేవంత్‌రెడ్డి అనుచరులను అరెస్ట్ చేశారు. రేవంత్ సహా 8 మందిపై నార్సింగ్ పీఎస్‌లో కేసు నమోదు చేశారు. ఐపీసీ 184, 187, 11 రెడ్ విత్ 5ఏ, ఎయిర్‌క్రాఫ్ట్ యాక్ట్ కింద కేసు నమోదయ్యాయి.

## నియంతలా పాలిస్తున్న కెసిఆర్: భట్టి

హైదరాబాద్,మార్చి6 (ఆర్ ఎన్ఎ): తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ వంటి నియంత సీఎం కావడం దురదృష్టకరమని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క విమర్శించారు. రూ. లక్ష కోట్ల రాష్ట్ర సంపదను దోచుకున్నారని భట్టి విక్రమార్క ఆరోపించారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని, రూ. లక్ష కోట్లు ఖర్చు చేసి కాళేశ్వరం నుంచి చుక్క నీరు ఇవ్వలేదని మండిపడ్డారు. మిడ్ మానేరు, శ్రీపాద ఎల్లంపల్లి కాంగ్రెస్ హయాంలో కట్టినవే అని భట్టి అన్నారు. రైతులకు ఇచ్చిన ఎన్నికల హామీలను కేసీఆర్ విస్మరించారని విమర్శించారు. రైతు రుణమాఫీ పై సభలో ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. బడ్జెట్ సమావేశాలు 30 పనిదినాలు నిర్వహించాలని, కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో ఐక్యత లేదు అనేది అపోహే అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# వైభవంగా లేపాక్షి ఉత్సవాలు

### సంప్రదాయ రీతిలో ఏర్పాట్లు చేయాలి
### మంచినీటి, వైద్య సదుపాయాలకు ప్రాధాన్యం
### సీమరుచులకు పెద్దపీట వేస్తూ ఫుడ్ కోర్టులు
### అధికారులతో టెలి కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సూచనలు

అనంతపురం,మార్చి6(ఆర్ఎన్ఎ): లేపాక్షి వైభవం 20 20 ను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గంధం చంద్రుడు ఆదేశించారు. గురువారం వివిధ శాఖల అధికారులతో లేపాక్షి వైభవం పై టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాయలసీమ సాంస్కృతిక వారసత్వం, సంప్రదాయాలు, జీవన విధానం,ఆహారపు అలవాట్లు ప్రతిబింబించే విధంగా లేపాక్షి వైభవం - 2020 నిర్వహిస్తున్నామని, మనరాష్ట్రం నుంచే కాకుండా కర్నాటక రాష్ట్రం నుంచి కూడా పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చే అవకాశం ఉన్నందున అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. లేపాక్షిలోని నంది విగ్రహం నుంచి వంద మీటర్ల దూరంలో విఐపి పార్కింగ్ ఏర్పాటు చేశామని, చిలమత్తూరు నుంచి వచ్చే వాహనాలకు పార్కింగ్ సౌకర్యం లేపాక్షికి దగ్గర్లోని కేజీబీవీ స్కూల్ వద్ద ఎదురుగా ఉన్న స్థలంలో ఏర్పాటు చేసినట్లు లేపాక్షి తాసిల్దార్ తెలిపారు. లేపాక్షి కి ఇతర వైపుల నుంచి వచ్చే వారికి కూడా పార్కింగ్ ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలని, ఎంపిక చేసిన పార్కింగ్ ప్రదేశాల్లో మార్కింగ్ వేయాలని ఆర్ అండ్ బి ఎస్ఈకి కలెక్టర్ ఆదేశించారు. ప్రజలందరి కలయికతో ఆహ్లాదకరంగా ఉత్సవాలు జరిగేలా చూడాలన్నారు. ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే ఈ ప్రాంతంలో ఏ ఏ కార్యక్రమాలు జరుగుతున్నాయి తెలిసేలా సూచిక బోర్డులు అధిక స్థాయిలో ఏర్పాటు చేయాలని టూరిజం శాఖ రీజనల్ డైరెక్టర్ ఈశ్వరయ్య ను ఆదేశించారు. అలాగే జటాయువు పక్షి వద్ద శోభాయాత్రలో భాగంగా ఎడ్లబండి డెకరేషన్ ఏర్పాట్లు, శోభాయాత్ర పూర్తయిన తర్వాత ఎడ్లబండ్ల నిలుపుదలకు ఏర్పాట్లు చేశామని జెసి2 రామ్మూర్తి తెలిపారు. ఎడ్లబండ్ల ఊరేగింపు సమయంలో పారిశుద్ధ్య నివారణకు అన్ని చర్యలు తీసుకోవాలని, అందుకు పారిశుధ్య వర్కర్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా లేపాక్షి ప్రధాన రహదారులలో ఎవరు చెత్త వేయరాదని ప్రజలందరికీ తెలియజేశామని, ఆటోల ద్వారా ప్రచారం చేశామని డి పి ఓ రామ్ నాథ్ రెడ్డి తెలిపారు. అలాగే క్రీడా ప్రదేశాలు, శ్రీ వీరభద్ర స్వామి దేవాలయం వద్ద, నంది విగ్రహం, జటాయువు పార్క్, మెయిన్ రోడ్డు, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో పరిశుభ్రత పాటించేలా ఏర్పాట్లు చేశామని, ఫాగింగ్ మిషన్ లు ఏర్పాటు చేసి దోమలు ప్రబలకుండా చర్యలు తీసుకున్నామన్నారు. రెండు రోజుల పాటు జరిగే లేపాక్షి వైభవాలలో పారిశుద్ధ్యం మెరుగుకు అవసరమైతే హిందూపురం మున్సిపాలిటీ కార్మికులను కూడా సిద్ధంగా ఉంచుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రధాన వేదిక వద్ద, ఫుడ్ స్టాల్స్ వద్ద, శోభాయాత్ర నిర్వహించే ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు పరిశుభ్రత పాటించేలా, పేరుకుపోతున్న చెత్త తొలగించేలా ఎక్కువమంది వర్కర్లను ఉపయోగించాలని కలెక్టర్ ఆదేశించారు. లేపాక్షి వైభవాన్ని తిలకించేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చే అవకాశం ఉన్నందున అన్ని చోట్ల తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని, ప్లాస్టిక్ నిషేధించాలని, లూజ్ వాటర్ తో పాటు పేపర్ గ్లాస్ లో నీటి సరఫరా చేయాలని ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ హరేరామ్ నాయక్ ను ఆదేశించారు. 40కిపైగా ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేసి రాయలసీమ వంటకాలను వడ్డించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీమ వంటకాలైన జొన్న రొట్టెలు, వర్గాన్ని, రాగి ముద్ద తదితర వంటలు వడ్డించే లా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఎటువంటి ఇబ్బందులు రాకుండా ట్రాఫిక్ మళ్లింపు చేపట్టాలని, అవసరమైన చోట బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు, ప్రధాన వేదిక వద్ద సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ ఏర్పాట్లు, రోడ్డు క్లియరెన్సు, ముళ్ళకంపలు తొలగింపు తదితర పనులను చేపట్టి వెంటనే పూర్తి చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకొని భవిష్యత్తు తరాలకు గుర్తుండిపోయేలా లేపాక్షి వైభవాన్ని ఘనంగా నిర్వహించేం దుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. 60 ఏళ్ల పైబడిన వృద్ధులకు మాస్కులు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## వైకాపా ఇక్కడో మాట..అక్కడో మాట

### భాజపా ఎంపీ సుజనా వ్యాఖ్య

న్యూఢిల్లీ,మార్చి6(ఆర్ఎన్ఎ): ఏపీ భవిష్యత్తుపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిపెడితే మంచిదని భాజపా ఎంపీ సుజనాచౌదరి అన్నారు. రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం ఇష్టమొచ్చినట్లు చేస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. రాజధాని ఉద్యమంపై రాసిన 'అమరావతి ఆక్రందన', 'స్టాప్ అన్‌డూయింగ్ ఆఫ్ అమరావతి' పుస్తకాలను సుజనాచౌదరి దిల్లీలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. రాజధాని ఉద్యమంలో సుమారు 50 మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు అందరికీ ఉంటుందని చెప్పారు. వైకాపా నేతలు అమరావతిలో ఒకమాట.. దిల్లీలో మరోమాట చెబుతున్నారని ఆరోపించారు. ఏపీ అంటేనే పారిశ్రామిక వేత్తలు పారిపోతున్నారని సుజనా వ్యాఖ్యానించారు. వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ 9 నెలల్లో ఏపీకి ఒక్క పరిశ్రమ అయినా వచ్చిందా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పన, వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమల స్థాపనపై ప్రభుత్వం దృష్టిసారించాలని సూచించారు. అమరావతి కోసం కేంద్రం రూ.వేలకోట్ల నిధులు వెచ్చించిందన్నారు. వివిధ వర్గాల మధ్య చిచ్చుపెట్టేలా రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారశైలి ఉంటోందని ఆయన విమర్శించారు.

# ఆర్థిక సంక్షోభంలో ప్రైవేట్ రంగం ఎస్ బ్యాంక్

### మారిటోరియం విధించిన ఆర్‌బిఐ
### డిపాజిటర్లకు ధోకా లేదన్న గవర్నర్ శక్తికాంత్ దాస్
### డిపాజిటర్లకు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ హామీ
### డిపాజిస్టుల వాపస్ తీసుకున్న టిటిడి..డబ్బుల కోసం ఖాతాదారుల క్యూ

న్యూఢిల్లీ,మార్చి6(ఆర్ఎన్ఎ): యెస్ బ్యాంకు వ్యవహారాలు కూడా సంక్షోభం అంచున ఉన్నాయి. ప్రైవేట్ రంగానికి చెందిన యస్ బ్యాంక్.. ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న విషయం తెలిసిందే. దేశవ్యాప్తంగా ఖాతాదారులు తమ డిపాజిట్లు వాపస్ తీసుకునేందుకు క్యూ కట్టారు. తమ డబ్బులను వాపస్ ఇవ్వాంటూ బ్యాంకు చుట్టూ తిరుగుతున్నారు. మరోవైపు ఇవాళ యెస్ బ్యాంకు షేర్లు 85 శాతం పడిపోయాయి. యెస్ బ్యాంకుపై ఆర్బీఐ మారిటోరియం విధించడం వల్ల ఆ బ్యాంకు ట్రేడింగ్‌లో బోరుమన్నది. కేవలం 50 వేలు మాత్రమే విత్‌డ్రా చేసుకోవాలని ఆర్బీఐ ఆంక్షలు పెట్టిన దరిమిలా విత్‌డ్రాకు అవకాశం లేకుండా పోతోంది. ఇదిలావుంటే డిపాజిటర్లకు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ హామీ ఇచ్చారు. డిపాజిటర్ల డబ్బు సురక్షితంగా ఉన్నట్లు ఆమె చెప్పారు. డిపాజిటర్లు, బ్యాంకు ప్రయోజనాల నేపథ్యంలో ఆర్బీఐ ఓ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె వెల్లడించారు. యెస్ బ్యాంకు సంక్షోభాన్ని త్వరలోనే పరిష్కరించనున్నట్లు ఆర్బీఐ గవర్నర్ తనకు హామి ఇచ్చినట్లు ఆమె చెప్పారు. ఆర్బీఐతో పాటు ప్రభుత్వం కూడా యెస్ బ్యాంకు కోలుకోవాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. నెలకు కేవలం 50 వేలు మాత్రమే విత్‌డ్రా చేసుకోవాలని యెస్ బ్యాంకు డిపాజిటర్లకు ఆర్బీఐ ఆంక్షలు పెట్టింది. అయినా యెస్ బ్యాంకుకు చెందిన ప్రతి ఖాతాదారుడి సొమ్ము సురక్షితంగా ఉంటుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ హామీ ఇచ్చారు. ఈ అంశంలో సత్వర పరిష్కారం కనుగొనే దిశగా ఆర్‌బీఐ కృషి చేస్తోందని వెల్లడించారు. ఈ విషయంలో ప్రభుత్వం, ఆర్‌బీఐ కలిసి పనిచేస్తాయని తెలిపారు. ఖాతాదారులు, బ్యాంక్, ఆర్థిక వ్యవస్థ ప్రయోజనాల దృష్టిలో ఉంచుకొనే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం ఖాతాదారులు రూ.50 వేల వరకు తీసుకునేలా ఏర్పాట్లు చేయడమే తమ ముందున్న తొలి ప్రాధాన్యమన్నారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు కృష్ణమూర్తి సుబ్రమణియన్ సైతం ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. యెస్ బ్యాంక్ పునర్నిర్మాణానికి ఉన్న అన్ని ప్రత్యామ్నాయాల్ని పరిశీలిస్తున్నామన్నారు. ఖాతాదారుల సొమ్ము భద్రంగా ఉందని హామీ ఇచ్చారు. అంతకుముందు ఈ సమస్యకు అతి త్వరలో పరిష్కారం చూపేందుకు ఆర్‌బీఐ కృషి చేస్తోందని గవర్నర్ శక్తికాంతదాస్ హామీ ఇచ్చారు. యెస్ బ్యాంక్ విషయంలో తీసుకున్న నిర్ణయాలు విస్తృత స్థాయిలో తీసుకున్నవని తెలిపారు. భారత ఆర్థిక, బ్యాంకింగ్ వ్యవస్థలో స్థిరత్వం నెలకొనే దిశగా చర్యలు ఉంటాయన్నారు. దేశీయ బ్యాంకింగ్ రంగ వ్యవస్థను మరింత పటిష్ఠం చేసేందుకు ఇదే సరైన సమయం అన్నారు. యెస్ బ్యాంకుకు మళ్లీ జీవం పోసేందుకు 30 రోజుల గడువు ఇచ్చామని, కానీ అంత కన్నా ముందే ఈ పక్రియ పూర్తి అవుతుందన్నారు. బ్యాంకుల సమస్యను పరిష్కరించాలంటే, ఆ బ్యాంకులకు కొంత సమయం ఇవ్వాలన్నారు. యెస్ బ్యాంకు సరిగా పనిచేయడం లేదని తెలిసిన తర్వాతనే ఆర్బీఐ జోక్యం చేసుకున్నదన్నారు. కరోనా వైరస్ వల్ల భారత మార్కెట్లపైన కూడా ప్రభావం పడే అవకాశం ఉన్నదని శక్తికాంత్ దాస్ తెలిపారు. గతంతో పోలిస్తే, గత 20 ఏళ్ల నుంచి ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో భారత్ అనుసంధానమై ఉందన్నారు. అయితే మిగితా దేశాల తరహాలో పూర్తిగా అంతర్జాతీయ మార్కెట్‌పై ఆధారపడి లేమని, అందుకే మనకు పెద్దగా నష్టమేమీ ఉండదన్నారు. యెస్ బ్యాంకు ఫండ్స్ అన్ని క్షేమంగా ఉన్నాయని యెస్ బ్యాంకు డిపాజిటర్లకు చీఫ్ ఎకనామిక్ అడ్వైజర్ కృష్ణమూర్తి సుబ్రమణియన్ హామీ ఇచ్చారు. ఎవరూ ఆందోళన చెందవల్సిన అవసరం లేదన్నారు.

## డిపాజిట్లు వాపస్ తీసుకున్న టిటిడి

ఈ పరిస్థితుల్లో తిరుమల తిరుపతి దేవస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. యస్ బ్యాంకులో డిపాజిట్ చేసిన రూ.600 కోట్లను వెనక్కి తీసుకుంది. అలాగే మిగిలిన ప్రైవేటు బ్యాంకులలో ఉన్న డిపాజిట్లు వ్యవహారంపై కూడా దృష్టిపెట్టింది. యస్ బ్యాంకు ఆర్థిక పరిస్థితి అనుకూలంగా లేకపోవడంతో.. డిపాజిట్లు వెనక్కి తీసుకోవాలని టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఆదేశించారు. ఛైర్మన్ ఆదేశానుసారం డిపాజిట్లను టీటీడీ విత్ డ్రా చేసింది. ఇకపై బ్యాంకుల రేటింగ్ ఆధారంగా డిపాజిట్లు చేయాలని పాలకమండలి నిర్ణయించింది.

## నీరవ్ మోడీకి బెయిల్ నిరాకరించిన బ్రిటన్ కోర్టు

న్యూఢిల్లీ,మార్చి6(ఆర్ఎన్ఎ):పీఎన్‌బీ కుంభకోణం కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీకి బ్రిటన్ కోర్టు బెయిల్ తిరస్కరించింది. కోర్టు ఆయనకు బెయిల్‌ను తిరస్కరించడం ఇది అయిదోసారి. ఈ ఏడాది 24వ తేదీ వరకు అతన్ని కస్టడీలో ఉంచనున్నారు. లండన్‌లోని వాండ్స్‌వర్త్ జైలులో అతను శిక్షను అనుభవిస్తున్నాడు. వీడియో లింక్ ద్వారా అతను కోర్టుకు బెయిల్ పిటిషన్ సమర్పించుకున్నాడు. వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ.. పీఎన్‌బీ బ్యాంకులో వందల కోట్ల స్కామ్‌కు పాల్పడ్డారు. స్కాట్‌ల్యాండ్ యార్డ్‌లో గత ఏడాది అతన్ని అరెస్టు చేశారు. మార్చి 11వ తేదీ నుంచి అప్పగింత పక్రియపై కోర్టులో విచారణ జరగనున్నది.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.